RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 210 మంగళవారం 25 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## కేసీఆర్,హరీశ్ రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ ?



మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ

తీర్పును రిజర్వ్ చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు

సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ రాజలింగమూర్తి క్రిమినల్ పిటిషన్ దాఖలు

ఇటీవలే హత్యకు గురైన రాజలింగమూర్తి

## ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రులు కాంగ్రెస్కు అండగా ఉండాలి



- నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలసభలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- పోటీ చేయని పార్టీకి ప్రశ్నించే అర్హత లేదు
- 55 వేల ఉద్యోగాలిచ్చాం
- టీచర్లు మాకే ఓటేయ్యాలి
- స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.
- కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారు
- మా సర్వే కరెక్టా? కేసీఆర్ సర్వే కరెక్టా?"

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాజీ సీఎం కేసీఆర్,బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని తమ ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారంటూ కేసీఆర్‌ను విమర్శించారు. ప్రజలు తిరస్కరించినా మార్పు రాకుండా, పార్టీ పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని బండి సంజయ్ ప్రశ్నిస్తున్నారు. కానీ, అసలు కేటీఆర్ అరెస్ట్‌ను అడ్డుకుంటున్నది బీజేపీయేనని రేవంత్ ఆరోపించారు.

**కేటీఆర్ ను రక్షిస్తోంది బీజేపీనే..**

"విదేశాల్లో ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను భారత్‌కు రప్పిస్తే, 24 గంటల్లోనే కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తాం. కానీ, బీజేపీ కేటీఆర్‌ను రక్షించే ప్రయత్నం చేస్తోంది" అని రేవంత్ ఆరోపించారు. "కేటీఆర్ అరెస్ట్‌కు బీజేపీ అడ్డుగా నిలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బీజేపీ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. కేటీఆర్ అరెస్ట్ కాకుండా చూస్తున్నందుకు బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ **వివరాలు 2 లో**

## తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల




- ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- మార్చి 3న నోటిఫికేషన్,
- 20న ఎన్నికలు
- మార్చి 29 నాటికి ఐదుగురి
- ఎమ్మెల్సీల పదవీకాలం

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది.మార్చి 29 నాటికి ఐదుగురి ఎమ్మెల్సీల

## 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం



కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

తమ ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగిందనివెల్లడి

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసం

తలసరి ఆదాయం పెరిగింది

"ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు

"వైఎస్సార్సీపీ పాలన వల్ల

రాష్ట్రం 25 ఏళ్ల ఆదాయాన్ని కోల్పోయింది

## రైతులకు శుభవార్త పీఎం కిసాన్ నిధులు విడుదల




పీఎం కిసాన్ 19వ విడత నిధుల్ని సోమవారం(ఫిబ్రవరి 24న) ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22వేల కోట్లతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2,000 చొప్పున మూడువిడతల్లో రూ.6,000 సాయం అందించే 'పీఎం కిసాన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటి వరకు 11 కోట్ల మంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందజేసింది.

## 2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులను పీకి పారేసిన ట్రంప్!



- వేల మంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు
- ప్రభుత్వ ప్రణాళికను నిలిపివేసేలా ఆదేశాలు జారీ
- ప్రభుత్వంచేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికే
- ఈ నిర్ణయం మిగిలిన ఉద్యోగుల్లో భయాందోళన
- దాదాపు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లనీయకుండా నిలిపివేత

## భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉంది



- ప్రధాని మోడీ
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగం
- జనాభా పరంగా మధ్య ప్రదేశ్ 5వ అతిపెద్ద రాష్ట్రం
- సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్ గా మారింది
- సమ్మిట్‌లో 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, దేశాల దౌత్యవేత్తలు

## తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు గెలవాలి

- ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమీక్ష
- ప్రచారానికి అతి తక్కువ సమయం ఉందని వెల్లడి
- టెక్నాలజీ వాడుకుని ఓటరుకు చేరువ కావాలని సూచన



గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నేతలతో మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నేతలతో మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసంలో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారానికి అతి తక్కువ సమయం మాత్రమే ఉండటంతో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రతి ఓటరును అభ్యర్థించాలని అన్నారు. ఎన్నికల ముందు రోజు శివరాత్రి పండుగ **వివరాలు 2 లో**


## మొదటిపేజీ తరువాయి

# భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉంది



భారత ఆర్థిక వ్యవస్థ పై ప్రపంచం ఆశాభావంతో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లో ఆయన ప్రసంగించారు.జనాభా పరంగా మధ్య ప్రదేశ్ 5వ అతిపెద్ద రాష్ట్రంగా ఉంది. వ్యవసాయం, ఖనిజాల పరంగా ముందు వరుసలో ఉంది. రెండు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇక్కడ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలన పై దృష్టి సారించింది. 20 సంవత్సరాలకు ముందు ఇక్కడికి రావాలంటే పెట్టుబడిదారులు ఆలోచించే వారు.కానీ ఇప్పుడు పెట్టుబడుల పరంగా ముందు వరుసలో ఉంది. అలాగే సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్ గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ విభాగం కీర్తించింది. ఇతర దేశాలు మాటలతో ఆగిపోతుంటే.. భారత్ చెప్పింది చేసి చూపించిందని ఆ సంస్థనే పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఈ సమ్మిట్ జరుగనుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఆయా దేశాల దౌత్యవేత్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల



Election Commission of India

PRESS NOTE

పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**ముఖ్యమైన తేదీలు :**

ఎన్నికల నోటిఫికేషన్ జారీ : మార్చి 3

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం : మార్చి 10

నామినేషన్ల పరిశీలన : మార్చి 11

నామినేషన్ల ఉపసంహరణ : మార్చి 13

పోలింగ్: మార్చి 20

ఓట్ల లెక్కింపు : మార్చి 20




బీఆర్ఎస్‌కు ఒక స్థానం! : మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లు బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎగ్గె మల్లేశం మాత్రం కొద్ది నెలల క్రితమే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా సహన్ ఎమ్?ఐఎమ్? నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్య బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది.

# తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు గెలవాలి



నేపథ్యంలో ప్రతి ఓటరు పోలింగ్ బూత్ లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్ చార్జి మంత్రులు, శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు.ఎన్నికల రోజు పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూటమి నాయకులంతా కలసికట్టుగా పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే, ప్రతి ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, జోనల్ కోఆర్డినేటర్లు సుజయకృష్ణ రంగారావు, ఎం.వి సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, మందలపు రవి తదితరులు పాల్గొన్నారు.

# 2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులను పీకి పారేసిన ట్రంప్!

మొదటిపేజీ తరువాయి

తాజాగా 2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగుల పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు.వేల మంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు ఇచ్చినట్లు యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్ మెంట్ వెబ్ సైట్ లోని నోటీసు ద్వారా తెలుస్తోంది.అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు , మానవతా దృష్టితో సహాయానికి యూఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను అమెరికా ప్రభుత్వం ఆపివేసిన విషయం తెలిసిందే. తాజాగా 2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగుల పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. మిగిలిన వారిలో కొంతమందిని మినహాయించి వేల మంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు.ఉద్యోగుల తొలగింపునకు ఫెడరల్ జడ్జి అనుమతించిన తర్వాతే ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో ముందుకెళ్లారు.ప్రభుత్వ ప్రణాళికను నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరిన ఉద్యోగుల విజప్తిని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్ల్ నికోలస్ తిరస్కరించారు. ప్రభుత్వంచేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికి పని చేస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ ఇప్పటికే అనేక మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగుల పై వేటు వేసిన విషయం తెలిసిందే.తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం మిగిలిన ఉద్యోగుల్లో భయాందోళన కలిగిస్తోంది. అయితే యూఎస్ ఎయిడ్ ద్వారా వృథా ఖర్చులు ఎక్కువవుతున్నాయని, అది నేరగాళ్ల సంస్థ అని మస్క్ ఇప్పటికే ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకే నిధులను ఆపేస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది.భవనంలోకి వెళ్లనీయకుండా ఇందులో భాగంగా దాదాపు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లనీయకుండా నిలిపివేశారు.ఈ ఆదేశాల పై ఫెడరల్ జడ్జి అమీర్ అలీ గతవారం తాత్కాలికంగా స్టే ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ సభ్యులు యూఎస్ ఎయిడ్ ద్వారా సాయం అందించడానికి ఆమోదం తెలిపినప్పుడు ప్రభుత్వం దాన్ని ఎలా నిలిపేయగలదని జడ్జి నిలదీశారు.అయినా



ట్రంప్ తన చర్యలను సమర్థించుకుంటున్నారు. యూఎస్ ఎయిడ్ ద్వారా భారత్ లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అమెరికా ప్రభుత్వం రూ.182 కోట్లు ఇచ్చిందని ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. ఇక పై అటువంటి నిధులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటైన భారత్ వద్ద చాలా డబ్బు ఉందని, ఆ దేశానికి తామెందుకు నిధులు ఇవ్వాలని ప్రశ్నించారు.దీంతో ఈ విషయం పై ఇరు దేశాల మధ్య భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం

మొదటిపేజీ తరువాయి



ఎన్నికల్లో ప్రజలు మా ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఇచ్చారని, ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైందని, గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని గవర్నర్ వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నామన్న గవర్నర్, అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ దస్త్రంపై సంతకం చేశామని, అన్న క్యాంటీన్లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు.

**తలసరి ఆదాయం పెరిగింది :** కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్న గవర్నర్, తమ ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామని వెల్లడించారు. ప్రతినెలా 1వ తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న గవర్నర్, బీసీవర్గాలు సమాజానికి వెన్నెముక అని వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్థానికసంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు గుర్తు చేశారు."ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టాం. అర్హులైన అందరికీ సొంతిల్లు ఉండాలనేది మా ఆకాంక్ష. ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు, విద్యుత్ ఉండాలి. యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వాలనేది మా విధానం. పీ-4 విధానం ద్వారా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో పేదరికం నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సరికొత్త విధానాలు తెచ్చాం. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం".

**టూరిజంలో పెట్టుబడులు పెరిగాయి :** 'మన బడి - మన భవిష్యత్తు' ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని గవర్నర్ తెలిపారు. మెరిట్ ఆధారంగా 9 వర్సిటీలకు వీసీలను నియమించామని, స్థానికసంస్థల్లో పోటీకి ఇద్దరు పిల్లలే ఉండాలన్న నిబంధన ఎత్తివేశామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించామని, ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల్లో 200 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండాలనేది సీఎం ఆకాంక్ష అని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో టూరిజంలో పెట్టుబడులు పెరిగాయని గవర్నర్ నజీర్ అన్నారు. ఎంఎస్ఎంఈలకు అండగా ఉన్నామని, అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా అనేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**రాయలసీమలో కరవు అనేదే ఉండదు :** తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీరందించేలా కార్యక్రమాలు చేపట్టామని, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్ల పూర్తయితే రాష్ట్ర రూపురేఖలు మారతాయని, రాయలసీమలో కరవు అనేదే ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనతో రాష్ట్రం ఆర్థిక పతనం అంచుకు చేరిందన్న గవర్నర్, రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని 7 శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు తెలిపామని గుర్తుచేశారు. గత ఐదేళ్ల పాలనలో వనరుల మళ్లింపు, సహజవనరుల దోపిడీ జరిగిందని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో ఎక్సైజ్, ఇసుకలో లోపభూయిష్ట విధానాలు జరిగాయన్న గవర్నర్, ప్రభుత్వ పన్నులను సైతం దారి మళ్లించారని చెప్పారు."వైఎస్సార్సీపీ పాలన వల్ల రాష్ట్రం 25 ఏళ్ల ఆదాయాన్ని కోల్పోయింది. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నాం. ప్రజల కోసం ఉచిత ఇసుక పాలసీ విధానం తెచ్చాం. సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తెస్తున్నాం. మా ప్రభుత్వం 8 నెలల్లోనే గణనీయమైన పురోగతి సాధించింది. గతప్రభుత్వం నిలిపిన 93 కేంద్ర పథకాల్లో 74 పథకాలు పునరుద్ధరించాం. నీటిపారుదల, రోడ్ల సంబంధిత రూ.10,125 కోట్ల బిల్లులు క్లియర్ చేశాం".


**రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు :** రూ.2,488 కోట్ల ఆర్థికసంఘం గ్రాంట్‌తో స్థానిక పాలన బలోపేతం చేశామని గవర్నర్ నజీర్ తెలిపారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించామని, విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చామని గుర్తు చేశారు. సుస్థిర వృద్ధికి దోహదపడే 22 కొత్త విధానాల ద్వారా బలమైన పునాది వేశామన్న గవర్నర్, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్ కంపెనీలను ఆకర్షించినట్లు తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలను ఆకర్షించామని, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.16 లక్షల కోట్లకు విస్తరించిందని అన్నారు."స్వర్ణాంధ్ర-2047కు పది సూత్రాలతో విజన్ రూపొందించాం. పేదరిక నిర్మూలన, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, నీటి భద్రత, రైతు-అగ్రిటెక్, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, వ్యయ నియంత్రణ, విద్యుత్-ఇంధనం ప్రత్యేక దృష్టి పెట్టాం. 'పీపుల్ ఫస్ట్' విధానంతో స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాం. పేదలకు ఆహార భద్రత కోసం పీడీఎస్‌ను బలోపేతం చేశాం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గవర్నర్ తెలిపారు."

# కేసీఆర్,హరీశ్ రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్?

మొదటిపేజీ తరువాయి

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనలో భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి భూపాలపల్లి లోయర్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని లోయర్ కోర్టు కొట్టివేయడంతో జిల్లా న్యాయస్థానంలో రాజలింగమూర్తి క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.రాజలింగమూర్తి పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్ రావుతో కలిపి ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టుకు పరిధి లేకున్నా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిందని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గత విచారణ సందర్భంగా జిల్లా కోర్టు ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది.

**ఇటీవలే హత్యకు గురైన రాజలింగమూర్తి :** ఫిర్యాదుదారు రాజలింగమూర్తి గత వారం హత్యకు గురయ్యాడు. విచారణ సందర్భంగా ఈ విషయం హైకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెందిన తర్వాత ఇక ఆ పిటిషన్‌ను ఎలా విచారిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా పిటిషన్‌ను విచారించొచ్చని వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పును చదివి వినిపించారు. మేడిగడ్డ బ్యారేజీ వల్ల లక్షా 30వేల కోట్ల ప్రజాధనం వృథా



అయిందన్న విషయాన్ని ఫిర్యాదుదారు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పీపీ వాదించారు.తీర్పును రిజర్వ్? చేసిన హైకోర్టు : ఇందులో ప్రజాప్రయోజనం ఉన్న దృష్ట్యా పిటిషన్‌ను విచారించొచ్చని పీపీ వాదించారు. గతంలో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జిల్లా కోర్టుకు ఉత్తర్వులు జారీ చేసే అధికారం లేదని ఆ ఉత్తర్వులను కొట్టివేయాలని కేసీఆర్, హరీశ్ రావు తరఫు న్యాయవాది కోరారు. ఈ మేరకు హైకోర్టు తీర్పును చదివి వినిపించారు. రాజలింగమూర్తి ఫిర్యాదును భూపాలపల్లి లోయర్ కోర్టు కొట్టివేయగా ఫిర్యాదుదారు జిల్లా కోర్టును ఆశ్రయించారని ఈ పిటిషన్‌పై తీర్పును పున పరిశీలించాలని జిల్లా కోర్టు కింది కోర్టును ఆదేశించి ఉండాల్సిందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రులు కాంగ్రెస్కు అండగా ఉండాలి

ఎందుకు పోటీ చేయడం లేదు?.. ఎన్నికల్లో పోటీ చేయలేని వాళ్లు, ఉపఎన్నికల్లో గెలుస్తామంటున్నారు." పదేళ్లుగా ఉపఎన్నికలు రాకుండా చూసిన బీఆర్ఎస్.. ఇప్పుడు ఎందుకు వస్తున్నాయో చెప్పాలి.. 2021లో కుల గణన, జనగణన ఎందుకు చేయలే?.. 2021లోనే కుల గణన, జనగణన ఎందుకు చేయలేకపోయారు? బండి సంజయ్, కిషన్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. మేము ఏడాదిలోనే కుల గణన పూర్తిచేశాం. వందేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాం. మా లెక్కలు తప్పని, బీజేపీ, బీఆర్ఎస్ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నాయి" అని రేవంత్ విమర్శించారు.

**పోటీ చేయని పార్టీకి ప్రశ్నించే అర్హత లేదు**

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది.. పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది..ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేరు..ఎన్నికల్లో పోటీ చేయని పార్టీ కి రాజకీయ పార్టీ అని చెప్పుకునే అర్హత ఉందా..? అని ఆయన ప్రశ్నించారు.ఎన్నికల బరిలో నిలబడని బీఆర్ఎస్ కు కాంగ్రెస్ ను ప్రశ్నించే అర్హత ఉందా..? పది నెలలలో ఏమీ చేయలేని కాంగ్రెస్ ను అంటున్న బీఆర్ఎస్ పదేళ్లలో ఏం చేసింది..? ఎన్నికల కోడ్ కారణంగా ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు మాత్రమే మాకు పరిపాలన చేసే అవకాశం వచ్చింది.. .పదేళ్లలో నిరుద్యోగ సమస్య కారణంగా అనేక మంది యువతీ యువకులు ఆత్మహత్య లు చేసుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

**55 వేల ఉద్యోగాలిచ్చాం**

"తెలంగాణ సాధనలో పట్టభద్రులది కీలకపాత్ర. కానీ, కేసీఆర్ పట్టభద్రుల కోసం ఏమి చేశారు? ప్రజలు ఆయన అవసరం లేదని తేల్చి చెప్పారు. చేసిందంతా చాలని, ఇక ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవాలని తీర్పునిచ్చారు. అయినా మార్పు లేకుండా ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారు. పదేళ్లపాటు ఏమీ చేయని వారు, ఏడాదిలో మేం ఏమీ చేయలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. పదేళ్లపాటు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఇచ్చిన వాటిపై వాళ్లే కేసులు వేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలు ఇచ్చింది. 11,000 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసింది. టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తిచేశాం" అని వివరించారు.

**టీచర్లు మాకే ఓటేయ్యాలి**

మేం 55 వేల ఉద్యోగాలు ఇస్తేనే కాంగ్రెస్ కు ఓటు వేయండి.. 35 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, 22 వేల మంది కి బదిలీలు చేయడంతో పాటు 17 వేల మందిని నూతనంగా నియమించాం..మేం చెప్పింది నిజమైతే మాకు టీచర్లు ఓటు వేయాలి.. 65 ఐటీఐ లను 2400 కోట్ల తో టాటా కంపెనీ సహకారంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు గా తీర్చిదిద్దుతున్నాం.. ఆనంద్ మహీంద్రా ను చైర్మన్ గా యంగ్ స్కిల్స్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధమౌతున్నాం అని రేవంత్ అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.**

"చదువుతున్న యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. టాటా సంస్థతో కలిసి 65 ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చాం. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. యువత క్రీడల్లో రాణించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపిస్తున్నాం. నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.2 కోట్లు ప్రోత్సాహకంగా ఇచ్చాం. క్రికెటర్ సిరాజ్‌కు మినహాయింపులతో గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చాం. పారా అథ్లెట్ జివాంజీ దీప్తికి ఇంటి స్థలం, రూ.25 లక్షలు మంజూరు చేశాం" అని వివరించారు.

**కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారు**

"26.50 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశాం. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారు. ఇప్పుడు ఆయా అప్పులకు ప్రతి నెలా రూ.600 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు కూడా రావడం లేదు. రిటైర్ అయ్యే ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని నడిపించారు" అని రేవంత్ ఆక్షేపించారు."దేశంలో ఎవరూ చేయని సాహసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. రాహుల్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతూ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తి చేశాం. వందేళ్లుగా జరగని కుల గణనను సమర్థంగా నిర్వహించాం" అని సీఎం వివరించారు.

మా సర్వే కరెక్టా? కేసీఆర్ సర్వే కరెక్టా?"

"కేసీఆర్ సర్వే ప్రకారం బీసీలు 51 శాతం ఉన్నారని చెప్పారు. కానీ, మా సర్వే ప్రకారం 56 శాతం పైగానే ఉన్నారు. ఇక, ప్రజలు చెప్పాలి.. మా సర్వే కరెక్టా? లేక కేసీఆర్ సర్వే కరెక్టా?" అని సీఎం రేవంత్ ప్రజలకు ప్రశ్న వేశారు.బీసీ లెక్క 56.33 శాతం అని నేను పక్కా గా తీశాను.. 15.29 శాతం ఓసీ లు, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీ లు, మైనార్టీ 12.56 శాతం ఉన్నారని తేల్చాం..మైనార్టీలను బీసీలలో ఎలా కలుపుతారని బండి సంజయ్ అంటున్నారు..1960 నుంచే మైనార్టీ లు బీసీ రిజర్వేషన్లు పొందుతున్నారు... గుజరాత్ రాష్ట్రంలో 29 ముస్లిం కులాలు బీసీ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ , బీహార్ లో ముస్లింలు బీసీలు రిజర్వేషన్లు పొందుతున్నారు..కేంద్ర మంత్రులు గా ఉండి అబద్దాలు చెపుతు వీధి నాటకాలు వేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 25 - 02 - 2025

## ఎమ్మెల్సీగా నన్ను గెలిపించండి ఇంద్రా గౌడ్



**తెలంగాణ సేన న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నన్ను గెలిపించాలని పట్టబద్రులకు విన్నవించుకున్న సిలివేరు ఇంద్ర గౌడ్ సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో సిలివేరి ఇంద్ర గౌడ్ మాట్లాడుతూ కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాకు అండగా నిలవాలని,ఎన్నికల బ్యాలెట్ పేపర్లో క్రమసంఖ్య నాలుగో నంబర్ పై సిలివేరి ఇంద్ర గౌడ్ అనే పేరు పక్కన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు, యువత రాజకీయాల్లో రావాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్సీగా నాకు అవకాశం ఇస్తే యువతకు అండగా ఉంటానని తెలిపారు.

## అంబేద్కర్ సంఘం సమావేశం




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ తెలంగాణా అంబేద్కర్ సంఘం ఆదర్యంలో సమావేశం జరిగింది అదే విధంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో ముస్లిమ్, క్రిస్టియన్, దళితులపై, అనేకమైన భూ పరంగా,కుల పరంగా, రాజకీయపరంగా, ఏదో విధంగా దాడులు జరుగుతూనే ఉన్నవి కాబట్టి అతి తొందర్లో నూతన కమిటీ ఏర్పాటుచేసి గ్రేటర్ పరిధిలో సదస్సు నిర్వహిస్తానని రాష్ట్ర కార్యాలయంలో అబ్దుల్ రెహ్మాన్ ప్రకటించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ముత్యాల జంగయ్య ,రాష్ట్ర మహిళా అధ్యక్షులు దాసరి మమత,మరియు రంగారెడ్డి జిల్లా సభ్యులు బి. సాలయ్య ఇ సమావేశానికి హాజరు అవ్వడం జరిగింది. వికారాబాద్ జిల్లా అడ్వైజర్ బి.రత్నయ్య కీ నియామక పత్రం ఇవ్వడం జరిగింది.

## నిత్యం కెసిఆర్ జపం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

కల్వకుంట్ల కవిత



**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన :** పలు కార్యక్రమాలకు సోమవారం రోజున మహబూబాద్ జిల్లాకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికిన తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు గంధసిరి వేణు టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కలవకుంట్ల కవిత గారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు ఊసే లేదని కేసీఆర్ గురించి పదేపదే మాట్లాడుతున్నాడు రేవంత్ రెడ్డి గారిని పరిపాలన మీద ధ్యాస లేదు గాని నిత్యం కెసిఆర్ మీద తన ధ్యాసని ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మీడియా సమావేశంలో మాట్లాడడం జరిగింది.

## మాధూర్ విద్యాలయ వార్షికోత్సవం




**సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** మాధుర్ విద్యాలయ హైస్కూల్ వారాసిగూడ 12వ వార్షిక దినోత్సవ వేడుకలను బిఎన్ఆర్ గార్డెన్స్ నామలగుండులో నిన్న సాయంత్రం జరుపుకుంది. ఈ సందర్భంగా టి ఆర్ ఎస్ ఎం ఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శ్రీ. కె. శివరామ కృష్ణ ఆచార్య మరియు ముషీరాబాద్ మండల అధ్యక్షులు శ్రీ. సందీప్ కుమార్‌తో పాటు మాథూర్ పాఠశాల కార్యదర్శి డాక్టర్ ఆర్‌విఎల్ఎన్ ప్రసాద్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలతో వివిధ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్లే బ్యాక్ సింగర్స్ వినాయక్ సతీష్, నిహారిక పాడిన పాటలు హైలైట్ గా నిలిచాయి స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్ రాజేశ్వరి. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## వికారాబాద్ లో టి పి ఎఫ్ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ




**వికారాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ వికారాబాద్ మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. వికారాబాద్ కన్వీనర్ కొలుమూల నాగభూషణం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత ప్రజల ఆశల అడియాశలైన వేళ దేశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ సమాజం ఏడు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేసింది ఇప్పటికే చేస్తానే ఉంది అమరుల త్యాగాలచే 1200 మంది విద్యార్థులు యువకుల బలిదానాలతో భౌగోళిక తెలంగాణ రూపంలో అది నెరవేరింది కానీ మొదటి నుండి తెలంగాణ ప్రజా ఫ్రంట్ దోపిడి పీడనలేని ప్రజాస్వామిక తెలంగాణకై మహనీయుల ఆశయాల సాధనకై ప్రజల పక్షాన పోరాడుతున్నది. మలిదశ తెలంగాణ ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్న సందర్భంలో ఆంధ్ర వలస పాలకులు భయపడిపోయే ఉద్యమాన్ని ఆపాలని కుట్రలు పని తెలంగాణ ఉద్యమకారులను అంతకముతాలచే సినప్పుడు నిర్బంధాలు నిర్బంధించినప్పుడు ఎదుర్కోలు నిలబడ్డ తెలంగాణ ప్రజాప్రతిని ప్రజల కోసం ప్రజలకై ప్రజా ఆకాంక్షల మేరకు తెలంగాణ రావాలని నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలు జరగాలని విద్య వైద్యం ప్రతి కుటుంబానికి ప్రభుత్వం విధిగా అందించాలని ముందంజలో ఉండి పోరాడుతుంది కనుక మార్చి 9 వ తారీకు వికారాబాద్ కేంద్రంలో జరగబోవు మొదటి మహాసభలను విజయవంతం చేయాలని కొలుముల నాగభూషణం కోరుతున్నాను తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర కమిటీ సభ్యులు కడమంచి రాంబాబు. వడ్ల విశ్వనాథం కే గోపాల్ గారు. చైతన్య సిరిపురం సంతోష గారు మధు గారు ప్రభావతి గారు తదితరులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేసి ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరడం జరిగింది.

# మళ్లీ కల్లోలితం తెలంగాణ కకావికలం

రోజువారీ అలవాటులో భాగంగా సోమవారం దినపత్రిక చేతిలోకి తీసుకోగానే పతాకవార్తగా తుపాకుల మోత కంటపడింది. ఏటూరునాగారం అడవుల్లో ఏడుగురికాల్చివేత దుర్వార్తను చదవాల్సి రావడం బాధాకరం. పదేండ్ల కిందట ప్రతి ఉదయం మోసుకొచ్చే నెత్తుటి సమాచారమే మళ్లీ పునరావృతమైపోయింది. వినకూడని,కనకూడని, కలలో కూడా రాకూడదనుకునే రాజ్యం రాసే రక్త చరిత్రను, మళ్లీ తెలంగాణ చదువుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పాత దుర్దినాలు మరిచి, పదేండ్ల పాటు ప్రగతి వార్తలకు అలవాటు పడిన సమాజం, ఏడాదిగా ప్రభుత్వం నోటి నుంచి జాలువారుతున్న అబద్ధాన్ని, విసురుతున్న చేతి వాటాన్ని, మోపుతున్న నిర్బంధాన్నిచవిచూస్తున్నది. ఏడాదిలోనే అంతటా అలజడి, అన్ని వర్గాల్లోనూ ఆందోళన అలుముకున్నది. రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తూ, ప్రజలను నిర్బంధంలోకి నెడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ సాగిస్తున్న అమానవీయ పరిపాలనపై అందరిలో ఆవేదన నిండుకున్నది. రాష్ట్ర ఆవిర్భావానికి మునుపు ఎలాంటి భయానక భౌతిక పరిస్థితి తెలంగాణలో ఉండేదో, ఏడాదిగా అదే విధమైన గడ్డుకాలం అన్ని గడపల్లోకి వచ్చిపడింది. అలజడి, ఆందోళన, అణచివేత అంతటా మళ్లీ వర్ధిల్లుతున్నది. పల్లెల్లో ఇనుప బూట్ల కవాతు, లాఠీల కోలాటం, సంకెళ్ల సవ్వడి, తుపాకుల గర్జన మళ్లీ మామూలైపోయింది. అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్ల వార్తలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పుడు తెలంగాణ నిప్పుల కుంపటిని నెత్తిన పెట్టుకొని దుఃఖిస్తున్నది. తెలంగాణకు మళ్లీ ఏ దుస్థితి రాకూడదనుకున్నామో, అదే విషమ పరిస్థితి రాష్ట్రమంతటా విస్తారమైపోయింది. శనివారం నాడు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీలపై ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర సర్కార్ సాగిస్తున్న దారుణ దమనకాండకు వ్యతిరేకంగా, దేశ రాజధానిలో నిర్వహిస్తున్న సభకు విపక్ష పార్టీల మద్దతు కోరుతూ, తెలంగాణ భవన్‌కు వారొచ్చారు. ఆ సందర్భంగా కేంద్ర సర్కారే కాదు, రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా హక్కుల హననంలో ఏడాదిలోనే ఎలా కర్కోటకంగా వ్యవహరిస్తున్నదో వారితో చర్చకు వచ్చింది. ఎన్నికలకు ముందు ఏడో గ్యారెంటీ పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసిన స్వేచ్ఛను, నేడు ఎలా చెరసాలల్లో ఖైదు చేస్తున్నారనే అంశంపై లోతైన చర్చే నడిచింది. ఇప్పుడు రాష్ట్రమే ఆంక్షల వలయంలో, నిర్బంధం నీడలో విలవిలలాడుతున్నది. ఈ వికారమైన మార్పును నిలువరించకపోతే, తెలంగాణ స్వాభావిక ఔన్నత్యం మసకబారిపోతుందని అందరం చర్చించుకున్నాం. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి పోరులో, పరుగులో భాగంగా, ప్రభుత్వంలోని వ్యవస్థగత సంస్థల ఏమరుపాటుతో ఒకటో రెండో పొరపాట్లు దొర్లి ఉండవచ్చు. కానీ, వికాసానికి విరుద్ధంగా నేడు రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రయోగిస్తున్న దమనకాండ రాష్ట్రానికి ప్రమాదకరంగా మారిపోయింది. దేశంలో ప్రభుత్వాల పగ్గాలు వివిధ కారణాలతోనో, ప్రేరకాల ప్రభావ రీత్యానో రాజకీయ పార్టీల చేతులు మారడం సాధారణంగా జరిగేదే. కానీ, మారిన ప్రభుత్వం ఏ నమూనా నెత్తిన పెట్టుకొని నడుస్తున్నదనేది తొలి ఏడాది పాలనలో తేటతెల్లమైపోతుంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 2 రూపాయలకు కిలో బియ్యం, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, బలహీన వర్గాల సంక్షేమం లాంటి అనేక అభ్యుదయ పథకాలు అమలుపరిచిన ఎన్టీఆర్ సర్కార్ కూడా 1989 ఎన్నికల్లో ఓడిపోయింది. కానీ, తదనంతర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను ఎలా తగులబెట్టిందో, తర్వాతి ఎన్నికల్లో ఏం జరిగిందో చరిత్రలో ఉండనే ఉన్నది. కాంగ్రెస్ చరిత్ర, రేవంత్‌రెడ్డి లాంటి వారి నేపథ్యం, స్వభావం తెలిసి తెలిసి, మధ్య తరగతి, బుద్ధి జీవులు మళ్లీ హస్తం పార్టీ విష ప్రచారం వలకు ఎరకావడమే తెలంగాణకు ఇక్కట్లు తెచ్చిపెట్టింది. తెలంగాణ పునాది సమూహమైన సామాజిక వర్గాలకు ఉన్న రాజకీయ స్పష్టత, నాలుగు అడుగులు ముందుకు జరిగిన వర్గాలకు



కరువవ్వడం వల్ల, ఇప్పుడు మళ్లీ తెలంగాణ తల్లడిల్లుతున్నది. కడుక్కున్న చేతులు ప్రదర్శించినంత మాత్రాన, నేర చరిత్ర, స్వభావం ఏ సంస్థ నుంచైనా, అందునా కాంగ్రెస్ నుంచి మాయమైపోతుందా..?. దానివల్లనే కాంగ్రెస్ మార్క్ అమానవీయ పరిపాలనను ఏడాదిగా ఎదుర్కోక తప్పటం లేదు. చరిత్రలో కాంగ్రెస్ పార్టీ పెంచిన జైళ్లు, పండించిన వంచన, పారించిన నెత్తురు అవగాహనపరులకు తెలియదా..? వృద్ధిని ఉరికొయ్యకు వేలాడదీసే హస్తం పార్టీ ప్రభుత్వాల సహజత్వం, దశాబ్దాలుగా మన దేశం, రాష్ట్రం మోసిన సత్యం మరిస్తే ఎలా..?. ప్రభావితవర్గాల తొందరపాటు, సమాజానికి ఎంత నష్టం చేస్తుందో, తెలంగాణకు అనుభవంలోకి వచ్చింది. సొంత ఊరిలో మాజీ సర్పంచ్ మరణానికి కారణమవ్వడమేకాక, స్వప్రయోజనాల కోసం, సొంత నియోజకవర్గ పేద, గిరిజన రైతులను హింసించి, జైళ్లపాలు చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్, రాష్ట్రాన్ని మాత్రం వదిలేస్తుందా..?. అందుకే ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, న్యాయం అడిగినోళ్లందరికీ బేడీలు తొడిగేస్తున్నది. నిర్బంధాన్ని విస్తరించి, జనాన్ని భయంతో నిలువరించడం ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుంది? ప్రజలపై రాజ్యహింస విజయం సాధించిన చరిత్ర ఏ దేశంలో, రాష్ట్రంలోనైనా ఉన్న దా..?. అయినా సరే అవకాశం దొరికిన ప్రతిసారి కాంగ్రెస్ అదే నియంతృత్వ నమూనాను అనుసరించడం సర్వ సాధారణం. ఏడాదిలో ఎన్ని సర్కార్ నేరాలు తెలంగాణలో జరిగా యో లెక్కే లేదు. సీఎం రేవంత్ సొంత జిల్లాలోనే షాద్‌నగర్‌లో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ సంఘటన, నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులపై థర్డ్ డిగ్రీ, బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి దారుణ హత్య, లగచర్లలో గిరిజనులపై అమానుషం ఇలా ఎన్నో దారుణాలు యథేచ్ఛగా జరిగిపోయాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, అక్రమ కేసులు షరామామూలైపోయాయి. ప్రధాన విపక్షమైన బీఆర్ఎస్ నేతలపైనే రెండు వేలకు పైగా అక్రమ కేసు లు నమోదు చేసి, కాంగ్రెస్ సర్కార్ తన వికృత నైజాన్ని చూపెట్టింది. ప్రజాసంఘాలు, పౌరహ క్కుల సంస్థలపై సహితం ఉక్కుపాదం మోపు తూ, ప్రజాస్వామ్య నిరసనలపై సర్కారే హింస ను ప్రయోగిస్తున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో థర్డీ యాక్ట్ అమలులో లేదు. కానీ, రేవంత్ సర్కార్ తెలంగాణ జిల్లాల్లో నెలల పాటు థర్టీ యాక్ట్ అమలుపరుస్తూ, సభలూ, సమావేశాలు, నిరసనలపై ఉక్కుపాదం మోపింది. ఏడాదిలోనే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు ఇలా తెలంగాణ అడవి బూటకపు ఎన్‌కౌంటర్లకు కేంద్రంగా మార్చివేయబడింది. చివరికి ఎదురుకాల్పులపై నిజ నిర్ధారణ కోసం వెళ్లిన పౌరహక్కుల సంఘం నేతలు, మేధావులను అక్రమంగా అరెస్టు చేసేశారు. ఈ విధమైన రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్బంధ విధానం చివరికి సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో నెలకొన్న దుస్థితిని పరిశీలించే హక్కునూ ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు నిరాకరిస్తున్నది. సర్కార్ నిర్లక్ష్యానికి దాదాపు 50 మంది గురుకుల, సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు బలైపోయారు. చావు తో యుద్ధం చేసి శైలజ అనే గురుకుల విద్యార్థిని చివరికి నిమ్స్‌లో తనువు చాలించింది. వివిధ రంగాల్లో పేదవర్గాల విద్యార్థులు ఎదిగి, తెలంగాణకు వేల కోట్ల సంపదగా మారాలనే మానవీయ సంకల్పంతో, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం గురుకులాలను తీర్చిదిద్దింది. అలాంటి ఆధునిక వికాసాలయాలను రేవంత్‌రెడ్డి సర్కార్ విధ్వంసం చేయడానికి వేగంగా పావులు కదుపుతున్నది. ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల బృందంలో ఒకడినైన నేనూ, వారితోపాటు క్షేత్రస్థాయి పరిస్థితిని అధ్యయనం చేయడానికి షేరిగూడ గురుకులానికి వెళ్లాను. ఆ సందర్భంగా 'అన్నం సరిగ్గా పెట్టకున్నా సరే చదువు కూడా సరిగ్గా చెప్పకపోతే మా బతుకులు ఏం కావాలి సార్' అని ఒక విద్యార్థి మాతో ఆవేదనగా మాట్లాడుతుంటే, మాకు ఎనలేని బాధ కలిగింది. ఎన్ని కఠిన పరిస్థితులనైనా ఎదుర్కొని, ఎదగాలని ఆశ పడుతున్న వర్గాల విద్యార్థులకు, అవకాశాలనూ సర్కారే నిరాకరిస్తే, దూరం చేస్తే, వారికి నిజంగానే మరో మార్గమేది? నెహ్రూ అన్నట్టు బహుళార్థక సాధక సాగు నీ టి ప్రాజెక్టుల్లాగానే, సంక్షేమ వసతిగృహాలు సైతం ఆధునిక దేవాలయాలే. పేదరికం, వివక్ష తదితర సామాజిక అంతరాల అంతానికి, ఈ రెండూ అత్యంత కీలకమైనవి. అయినా విధ్వంసాన్ని నమ్ముకున్న రేవంత్ సర్కార్, కాళేశ్వరం కూలిపోవాలని కలగంటున్నట్టే, గురుకులాలు కూడా మూతపడాలని ఉబలాటపడకుండా ఉం టుందా..? పాలకుడి నిర్లక్ష్యం, అహంకారం సమాజానికి ఎంత నష్టం చేస్తుందో రేవంత్ సర్కార్ పాలనాతీరుతో తెలిసిపోయింది. 'ఏడాదిలో ఏమవుతుంది/ ఇంకా కొన్నాళ్లాగమంది/ చెల్లాచెదురైన తెలుగు వారంతా/ తెల్లబోయి చూశారు' అని శరచ్చంద్రిక (ఖడ్గ సృష్టి) లో శ్రీశ్రీ గారు రాసినట్టు, నేడు రేవంత్ రెడ్డి సర్కార్ తీరుకు, తెలంగాణ జనమంతా విస్తుపోయి చూస్తున్నారు. గ్యారెంటీల అమలు దేవుడెరుగు, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో, అసహజ వాతావరణాన్ని సర్కారే సృష్టిస్తుండటం దారుణం. ప్రజల పట్ల సానుకూల దృక్పథం లేని వికార స్వభావాన్ని ప్రభుత్వం పదే పదే ప్రదర్శిస్తున్నది. కూల్చివేతలు, కాల్చివేతల విధానాన్ని అవాహ నం చేసుకున్న రేవంత్ సర్కార్, రాష్ట్రాన్ని మళ్లీ ప్రపంచ బ్యాంకు విధానాలకు ప్రయోగశాలగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నది. 'పాలన ఏం పాలన.. ఇది ఫాసిస్ట్ పాలన.. కాంగ్రెస్ పాలన. కర్కశ మూకల పాలన.. పాలన, ఇది ఏమి పాల న' అని ఎనభై దశకంలో జనం పాడుకున్న పాట మళ్లీ యథాతథంగా పాడుకునే పరిస్థితులు పునరావృతమయ్యాయి. వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ, ఉపాధి, సేవల రంగాల్లో సంక్షోభం సృష్టిం చి, వరల్డ్ బ్యాంక్ దయాదాక్షిణ్యాల ఆధారిత రాష్ట్రంగా మలిచే కుట్రలు అమలవుతున్నాయి. పదేండ్ల ప్రగతి కష్టపడి కూడబెట్టుకొని దొంగల పాలు చేసినట్టయింది. అయినా నేడు తిరగబడుతున్న తెలంగాణ మళ్లీ తన ఆత్మగౌరవాన్ని, అస్తి త్వాన్ని కచ్చితంగా నిలబెట్టుకొని తీరుతుంది.

# పురుషులకే ఎక్కువ ముప్పు

ప్రొస్టేట్ క్యాన్సర్‌తోపాటు మరికొన్ని క్యాన్సర్ల బారినపడుతూ పురుషులు ప్రాణాలు కోల్పోతున్నారు. క్యాన్సర్‌కు ఆడ, మగ, చిన్న, పెద్ద తేడా లేదు. కానీ, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పొగాకు ఉత్పత్తుల వాడకం, జన్యుపరమైన సమస్యల కారణంగా మగవాళ్లు అధికంగా క్యాన్సర్ రోగాల బారినపడుతున్నారు. మగవాళ్లని వెంటాడుతున్న క్యాన్సర్‌లపట్ల వాళ్లకు అవగాహన ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పురుషులకు ఎలాంటి క్యాన్సర్లు ఎక్కువ వస్తున్నాయి? వాటికి కారణాలు, చికిత్సతోపాటు ఆ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నేటి ఊపిరిలో తెలుసుకుందాం. క్యాన్సర్.. అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. దీని బారినపడుతున్న వాళ్లు ఏటా పెరుగుతున్నారు. ఈ వ్యాధి సోకే సగటు వయసు కూడా తగ్గిపోతున్నది. ఆధునిక వైద్య విధానాలు, సాంకేతిక పద్ధతుల్లో ఎంతో అభివృద్ధి జరిగింది. వీటి ద్వారా క్యాన్సర్‌ని గుర్తించడం, చికిత్స చేయడంలో ఎంతో మార్పు వచ్చింది. అయినా అవగాహనారాహిత్యం వల్ల క్యాన్సర్ మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. ప్రొస్టేట్ క్యాన్సర్‌తోపాటు నోటి క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, చర్మ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవాళ్లలో పురుషులే ఎక్కువగా ఉంటున్నారు.

### సిగ్గుపడితే సమస్యే...

క్యాన్సర్ బారినపడిన పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్లే ఎక్కువ. సాధారణ క్యాన్సర్లతోపాటు పురుషులకు మాత్రమే వచ్చే ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడేవాళ్లు పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. పురుష జననేంద్రియ వ్యవస్థలో ప్రొస్టేట్ అనే గ్రంథి ఉంటుంది. ఇందులో వీర్యం ఉత్పత్తి అవుతుంది. అలాగే మూత్ర విసర్జన, వీర్యస?లనాలను ఇది నియంత్రిస్తుంది. ఈ గ్రంథి మూత్రం రావడం, మూత్ర విసర్జన ఆపడం వంటి (స్విచ్చింగ్) నియంత్రణలకు ప్రేరణనిస్తుంది. మూత్రాశయానికి కింద, పురష నాళానికి పైన ప్రొస్టేట్ గ్రంథి కడుపులో అమరి ఉంటుంది. ఇది పురుష జననాంగాలకు సమీపంలో ఉంటుంది. ఈ గ్రంథికి క్యాన్సర్ సోకితే దానిని ప్రొస్టేట్ క్యాన్సర్ అంటారు. ప్రొస్టేట్ గ్రంథి క్యాన్సర్ బారినపడినప్పుడు మూత్రం విసర్జనలో తేడాలుంటాయి. మంట లేదా నొప్పి, మూత్ర విసర్జన పూర్తయిన భావన కలగకపోవడం లాంటి మార్పులుంటాయి. అలసట ఉంటుంది. ఈ లక్షణాలను చాలామంది పట్టించుకోరు. పరీక్షలు చేయించుకోరు. అందువల్ల ప్రొస్టేట్ క్యాన్సర్‌ని చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారు. తొలి దశల్లో గుర్తిస్తే ఏ క్యాన్సర్‌ని అయినా తేలిగ్గా నివారించవచ్చు. కానీ, ప్రొస్టేట్ క్యాన్సర్ లక్షణాలు తొందరగా బయటపడకపోవడం, బయటపడినా గుర్తించకపోవడం వల్లనే చివరి దశల్లో ఎక్కువ మంది వైద్యులను సంప్రదిస్తున్నారు. కాబట్టి మరణాలు కూడా పెరుగుతున్నాయి. ఈ వ్యాధి బారినపడకుండా మగవాళ్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### పరీక్షలే పరిష్కారం...

పురుషుల్లో.. కడుపులో జననాంగాలకు సమీపంలో నొప్పి కలిగితే ఇతర నొప్పి అనుకుని వదిలేస్తుంటారు. కొంతమంది ఆ నొప్పి గురించి అవగాహన లేక, ఉన్నా చెప్పుకోవడానికి సిగ్గుపడతారు. అదే తగ్గిపోతుందిలే అనే భావనతో ఉంటారు. కొన్నాళ్ల తర్వాత సమస్య తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదిస్తారు. ఇలాంటి సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రొస్టేట్ క్యాన్సర్‌ని గుర్తించే ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్ఏ) రక్త పరీక్ష చేయించుకోవాలి. ఈ పరీక్ష క్యాన్సర్‌ని నిర్ధారించలేదు. కాబట్టి ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ స్థాయిని బట్టి తర్వాత ఎం.ఆర్.ఐ., బయాప్సీ పరీక్షలు కూడా చేయించుకోవాలి. సాధారణంగా 50 ఏళు దాటిన పురుషులు ఏడాదికి ఒకసారి ప్రొస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలి. ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ రక్తపరీక్ష, డిజిటల్ రెక్టల్ పరీక్ష ద్వారా ప్రొస్టేట్ ఆరోగ్యాన్ని నిర్ధారిస్తారు. ఒకవేళ తండ్రి, తల్లి వైపు రక్తసంబంధీకుల్లో ఎవరైనా ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడితే 40 ఏళ్ల వయసు నుంచే ఏడాదికి ఒకసారి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి.

### పుట్టుమచ్చలతో పొంచి ఉన్న ముప్పు...

స్త్రీ, పురుషుల్లో చర్మంపై ఏర్పడే పుట్టుమచ్చలు కొన్ని సందర్భాల్లో చర్మ క్యాన్సర్‌లకు దారితీయొచ్చు. అందుకని చర్మంపై ఏర్పడే పుట్టుమచ్చలు పరిమాణంలో, ఆకారంలో మార్పులు గుర్తిస్తే వైద్యులను సంప్రదించాలి. చర్మంపై ఉన్న పుట్టుమచ్చలు సాధారణమైనవా లేక క్యాన్సర్ మచ్చలో నిర్ధారించేందుకు ఏబీసీడీఈ పద్ధతిని అనుసరించాలి. ఏబీసీడీఈ పద్ధతి అంటే ఏ- ఒక పుట్టుమచ్చను రెండు అర్ధ భాగాలుగా విభజించి చూసినప్పుడు రెండు భాగాలు ఒకేలా ఉండకూడదు. బీ- పుట్టుమచ్చ అంచులు లేత రంగులో లేదా గరుకుగా ఉండకూడదు. సీ- పుట్టుమచ్చ రంగులో మార్పు రాకూడదు. డీ- పుట్టుమచ్చ వ్యాసం 1/4 అంగుళం కన్నా ఎక్కువగా ఉండకూడదు. ఈ- పుట్టుమచ్చ చర్మం మీద ఉబ్బెత్తుగా, వాచినట్లుగా ఉండొద్దు. పుట్టుమచ్చను పరిశీలించినప్పుడు పై లక్షణాలు ఉన్నట్లయితే వైద్యుణ్ని సంప్రదించాలి.

### పెద్దపేగు క్యాన్సర్...

పెద్దపేగులో తొలుత చిన్న గుల్లలు ఏర్పడి, అవి క్రమంగా క్యాన్సర్ కణుతులుగా మార్పుచెందే ప్రమాదం ఉంది. ఈ లక్షణాలు తరచుగా ఎదుర్కొంటుంటే పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి. ఆలస్యం చేయకుండా వైద్యులతో నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. డయేరియా, మలబద్ధకం సమస్యలు దీర్ఘకాలంగా ఉండటం. పొత్తికడుపు భాగంలో నొప్పి లేదా పట్టేసినట్లు ఉండటం. ఆకస్మికంగా బరువు తగ్గడం. మలద్వారం వద్ద రక్తస్రావం కావడం, మలంలో రక్తం పడటం. వీరు అప్రమత్తంగా ఉండాలి గతంలో క్యాన్సర్ వచ్చి తగ్గిన వారు. అల్సరేటివ్ కొలైటిస్ ఉన్నవారు. రక్త సంబంధీకుల్లో (తల్లిదండ్రులు, తోడబుట్టినవారు, పిల్లలు)ఎవరికైనా క్యాన్సర్ ఉన్నట్లు తేలితే అప్రమత్తంగా ఉండాలి. ఈ తరహా ఇబ్బందులు ఉన్నట్లయితే ప్రతి మూడేండ్లకు ఒకసారి ఎఫ్‌వోబీటీ, ఫ్లెక్సిబుల్ సిగ్మాయిడో స్కోపి వంటి పరీక్షలు చేయించాలి.

### ఓరల్ క్యాన్సర్...


భారత దేశంలో రోజురోజుకు పెరుగుతున్న పెరుగుతున్న క్యాన్సర్ కేసుల్లో నోటి (ఓరల్) క్యాన్సర్‌లు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ రోగుల్లోనూ పురుషులే అధికంగా ఉన్నారు. అందుకని ప్రతి వ్యక్తికీ నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ ఎంతో అవసరం. సాధారణంగా నోటిలో కలిగే ప్రాథమిక మార్పుల వల్ల కూడా ఈ రుగ్మతను ఆరంభ దశలో గుర్తించవచ్చు. పొగాకు ఉత్పత్తులు తినడం, పొగతాగడం, మద్యపానం తదితర కారణాల వల్ల ఈ నోటి క్యాన్సర్ వస్తుంది.

### చికిత్సా పద్ధతులు...

క్యాన్సర్ సోకిన భాగం, వ్యాధి ఉన్న దశ, రోగి వయసు, మెడికల్ హిస్టరీ ఆధారంగా చికిత్సా పద్ధతులు ఆధారపడి ఉంటాయి. సర్జరీ, రేడియేషన్, కీమో, టార్గెటెడ్ థెరపీతోపాటు కొన్నిరకాల సమ్మేళన థెరపీలను కూడా అవసరానికి అనుగుణంగా ఇవ్వడం జరుగుతుంది. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే స్టేజ్-1, స్టేజ్-2లో కూడా కేవలం సర్జరీతోనే వ్యాధిని శాశ్వతంగా నయం చేయవచ్చు. సర్జరీ తర్వాత పునర్నిర్మాణ శస్త్రచికిత్స అవసరం ఎక్కువగా ఉంటుంది. స్టేజ్-3, 4లో ఉన్న రోగులకు కీమో, రేడియేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. 3 డీసీఆర్‌టీ, వీఎంఏటీ, ఐజీఆర్‌టీ, ఐజీకేటీ, బ్రాకీథెరపీ, బీమ్ థెరపీలాంటి ఆధునిక పద్ధతులతో రేడియోథెరపీ ద్వారా చికిత్స అందించవచ్చు. సాధారణంగా ఈ క్యాన్సర్లకు కీమో థెరపీ పాత్ర తక్కువగా ఉంటుందని చెప్పవచ్చు. కొన్ని సందర్భాలలో కీమోను మిశ్రమ చికిత్సగా అందిస్తారు. ఉపశమనం కోసం పాలియేటివ్ కేర్‌నూ ఉపయోగించాల్సి వస్తుంది.


### నోటి క్యాన్సర్ హెచ్చరికలు..

నోటిలో మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. మద్యపానం, ధూమపానం, గుట్కా, పాన్ మసాలా నమిలే అలవాటు వెంటనే మానుకోవాలి. నోటిలో ఏవైనా గడ్డలు లేదా అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, సకాలంలో చికిత్స తీసుకోవాలి. నోటిలో లేదా గొంతులో, చెంపలపై ఏర్పడే పుండ్లను తేలికగా తీసుకోవద్దు. డాక్టర్ చింతమడక సాయిరామ్ క్లినికల్ ఆంకాల జిస్ట్ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్.



### రాత్రి పూట డిన్నర్ చేశాక వాకింగ్

# చేస్తే ఎన్నో అద్భుతమైన ఫలితాలు



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే వ్యాయామం అంటే మరీ కష్టపడి జిమ్‌లలో కసరత్తులు చేయాల్సిన పనిలేదు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు సాధారణ వాకింగ్ చేసినా చాలు. ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం వాకింగ్ చేయడం వల్ల రోజంతా మెటబాలిజం ఎక్కువగా ఉంటుంది. ఇది క్యాలరీలను కరిగిస్తూనే ఉంటుంది. కనుకనే ఉదయం వ్యాయామం చేయాలని వైద్యులు చెబుతుంటారు. అయితే కేవలం ఉదయం మాత్రమే కాదు.. రాత్రి పూట భోజనం అనంతరం కూడా వాకింగ్ చేయాలి. దీంతో మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయడం ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

**అధిక బరువు, షుగర్ లెవల్స్..**

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కనీసం 10 నిమిషాల పాటు తేలికపాటి నడక కొనసాగించాలి. రాత్రి పూట మన మెటబాలిజం తగ్గుతుంది. కానీ వాకింగ్ చేస్తే మెటబాలిజంను పెంచుకోవచ్చు. దీంతో రాత్రి మనం నిద్రించినా కూడా మన శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తూనే ఉంటుంది. ఫలితంగా మనం నిద్రలో ఉన్నా కూడా మన శరీరంలోని కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట డిన్నర్ తరువాత వాకింగ్ చేస్తే ఎన్నో మంచి ఫలితాలను పొందవచ్చు. ఇక రాత్రి పూట భోజనం అనంతరం వాకింగ్ చేయడం వల్ల షుగర్ లెవల్స్‌న అదుపులో ఉంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాత్రి డిన్నర్ తరువాత వాకింగ్ చేసేవారి ఫాస్టింగ్ షుగర్ లెవల్స్ చాలా వరకు తగ్గాయని తేల్చారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ షుగర్ లెవల్స్‌ను తగ్గించుకునేందుకు గాను రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.

**కొలెస్ట్రాల్ లెవల్స్..**

కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా ఉన్నవారు రోజూ కచ్చితమైన డైట్‌ను పాటిస్తూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అప్పుడే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అయితే రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు రోజూ రాత్రి వాకింగ్ చేస్తే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే రోజూ రాత్రి వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని, కడుపు ఉబ్బరంగా ఉంటుందని భావించే వారు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేస్తే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

సాధారణంగా భోజనం చేసిన వెంటనే శరీరంలో రక్త సరఫరా మొత్తం జీర్ణాశయం వైప చేరుతుంది. కానీ రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. బీపీ ఉన్నవారు రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రాత్రి డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. రాత్రి వాకింగ్ చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మీరు యజమానా? వాచ్ మ్యానా?


దైనందిన జీవితంలో సత్యం అనిపించిన ఎన్నో విషయాలు ఆర్థిక సూత్రాల్లో అంతగా ఇమడవు! ఓ మధ్యతరగతి మనిషికి పొదుపు అంటే%ొా% ఖర్చులు తగ్గించుకోవడం వరకే ఆలోచిస్తాడు. మదుపు అంటే ప్రైవేటుగా చిట్స్ వేసి.. ధర్మవడ్డీకి తిప్పడమనే తెలుసు!! ముచ్చటపడి కట్టుకున్న ఇంట్లో మురిపెంగా ఉండాలని ఉన్నా.. ఇంకేదో ఆశిస్తాడు. రూపాయి, రూపాయి కూడబెట్టి ఇల్లు మీద ఇల్లు కట్టి.. యజమానిగా చెలామణీ కావాలని ఆశిస్తాడు. ఈ రకంగా ఆలోచించిన ఎందరో.. యజమానులుగా కన్నా, జీతం భత్యం లేని వాచ్‌మెన్లుగా మిగిలిపోతున్నారు. ఏ పెట్టుబడి అయినా మనల్ని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేదై ఉండాలి. కానీ, ఆ పెట్టుబడే గుదిబండగా మారితే.. ఆశించిన లాభాలు రావు సరికదా, తలకు మించిన భారంగా పరిణమిస్తుంది. నడివయసులోనే సొంతింటి కలను నిజం చేసుకున్న వారు నిజంగా అదృష్టవంతులే! దానికి తృప్తిచెంది.. ఇతర పెట్టుబడుల గురించి ఆలోచిస్తే మేలైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు. కానీ, చాలామంది మూసపద్ధతికి అలవాటుపడినవాళ్లే ఉంటారు. వాళ్లు చేసే తప్పులు ఎలా ఉంటాయో పరశురామ్ కథ చదివితే అర్థమవుతుంది. పరశురామ్ ప్రైవేట్ ఉద్యోగి. మంచి జీతం వస్తుంది. ఊళ్లో కొద్దోగొప్పో ఆస్తి ఉంది. భార్య, ఇద్దరు పిల్లలు. జీవితం ఉన్నంతలో రిచ్‌గానే సాగిపోతుంది. పిల్లలు బడి వయసు దాటి కాలేజీలోకి ప్రవేశించారు. ఒకరోజు పరశురామ్ అత్తామామ ఊడిపడ్డారు. అత్తగారేమో తన కూతురుతో వంటింట్లో సొంతిళ్లు సొద మొదలుపెట్టింది. మామగారేమో అల్లుడితో అదే విషయాన్ని తన అనుభవాన్నంతా రంగరించి చెప్పనారంభించాడు. 'అల్లుడుగారూ! కూడబెట్టిన సొమ్ముతో మంచి స్థలం తీసుకోండి. మంచి బిల్డర్‌కు ఇచ్చి లోను మీద ఇల్లు కట్టుకోవచ్చు. మూడంతస్తులు వేసి.. పై పోర్షన్‌లో మీరు ఉండి, మిగతావి అద్దెకిస్తే.. తిని కూర్చోవచ్చు! ఏమంటారు?' అన్నాడు. మామగారి ఆలోచన సబబుగానే తోచింది పరశురామ్‌కు. తల్లి బోధతో అతని భార్య కూడా ఆలోచించండి అన్నట్టుగా చూసింది.

**కోరికలు.. ఫిర్యాదులు..**

ఇల్లు కట్టాలని ఫిక్సయిన పరశురామ్ అప్పటి వరకు తను కూడబెట్టుకున్న డబ్బంతా వెలికితీశాడు. ఈపీఎఫ్‌లో ఉన్న మొత్తాన్ని తీసుకున్నాడు. కొంత బంగారం కుదువపెట్టాడు. వెంచర్‌లో చిన్న స్థలాన్ని అమ్మేసి రూ.కోటి సర్దుబాటు చేసుకున్నాడు. ఆ మొత్తంతో నగర శివారులో 220 గజాల స్థలం కొన్నాడు. బిల్డర్‌ను సంప్రదిస్తే మరో కోటితో జీం2తోపాటు పైన పెంట్‌హౌజ్ నిర్మించేలా ఒప్పందం చేసుకున్నాడు. బ్యాంకులో రూ.1.20 కోట్లు గృహరుణం తీసుకున్నాడు. అప్పటికే 45 ఏండ్లు ఉండటంతో, లోను టెన్యూర్ 15 ఏండ్లు పెట్టుకున్నాడు. ఈఎమ్ఐ రూ.1.20 లక్షలుగా ఫిక్సయింది. అంటే అతని జీతంలో సగం వాయిదాకు చెల్లించాలని ఫిక్సయ్యాడు! ఇల్లు పూర్తయింది. ఆరు పోర్షన్లు అద్దెకిస్తే నెల తిరిగేసరికి రూ.60వేలు వసూలు అవుతున్నాయి. పరశురామ్ ఆనందానికి అవధుల్లేవ్. మూడు నెలలు గడిచాయో లేదో.. అద్దెదారులు పరస్పరం గొడవలకు దిగడం, తీర్పు కోసం పరశురామ్ తలుపు తట్టడం కామన్ అయిపోయింది. తప్పు చేసిన వారిని ఇల్లు ఖాళీ చేయించడమో, అలా చేయలేకపోతే తమదే ఒప్పు అనుకున్న వాళ్లు మరో ఇంటికి మకాం మార్చడమో జరుగుతూ వచ్చింది. ఆరు పోర్షన్లలో ఎప్పుడూ రెండు ఖాళీగానే ఉంటున్నాయి. ఇది చాలదన్నట్టు.. నీళ్లు రావడం లేదనీ, కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నదనీ, మంచి నీళు పైకి వచ్చేలా ఏర్పాటు చేయమనీ, వాష్‌రూమ్‌లో నీళ్లు పోవడం లేదనీ.. ఇలా రోజుకో ఫిర్యాదు రావడం మొదలైంది. వాళ్ల కోరికలు మన్నించలేక, ఫిర్యాదులు పరిష్కరించలేక.. పరశురామ్‌కు సొంతింట్లో ఉంటున్న ఆనందం రెండేండ్లకే ఆవిరైంది. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు. స్పష్టంగా చెప్పాలంటే.. రెండు కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసిన యజమాని కాస్త ఆ ఇంటికి వాచ్‌మ్యాన్‌గా మారిపోయాడు. ఇప్పుడు మీరు ఆలోచించండి.. రూ.2.20 కోట్ల పెట్టుబడి పెట్టి.. ఇల్లు తీసుకున్న వ్యక్తి దర్జాగా బతక్కుండా, ఇలా నీరుగారిపోవడాన్ని ఏ ఆర్థిక సూత్రం మాత్రం ఆమోదిస్తుంది. ఇదే పరశురామ్ రూ.కోటితో ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌గానీ, అదే నగర శివారులో డూప్లెక్స్ ఇల్లు గానీ తీసుకుంటే.. 'అనుభవించు రాజా!' అని పాడుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేసేవాడు. తానొకటి తలస్తే విధి మరొకటి తలచింది. శాశ్వత ఆదాయం మాయలోపడి జీవితంలో ప్రశాంతతకు దూరం అయ్యాడు. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు.




# పేరులోనే అంతా ఉంది




మార్పు శాశ్వతం అనే చమత్కారాన్ని మనం తరచూ వింటూనే ఉంటాం. తెలుగు సాహిత్యంలో ఈ మార్పును కవులు బాగానే ఒంటపట్టించుకున్నారు. ముఖ్యంగా తమ కవిత్వ సంకలనాల శీర్షికల విషయంలో ఈ మార్పు కనిపిస్తుంది. ఇంతకుముందు అంటే రెండు, మూడు దశాబ్దాల క్రితం అన్నమాట.. కవిత్వ సంకలనాలకు మూస టైటిళ్లు ఉండేవి. తాము రాసిన కవితల్లో ఓ కవిత పేరే సంకలనానికి పెట్టేవారు. ఇది ఇప్పుడూ కొనసాగుతోంది కానీ, ఆ కవితకు పెడుతున్న శీర్షికే కొత్తగా, ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా ఓ దశాబ్దం నుంచి కవుల్లో ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే మార్పు కోరిన తరంగా కనిపిస్తోంది. 'ఒక వెళ్లిపోతాను' అని ఎం.ఎస్.నాయుడు తన కవిత్వ సంకలనానికి అందులోని ఒక పద్యం పేరే పెడితే తెలుగు సాహిత్య లోకమంతా చాలా ఆశ్చర్య పోయింది. ఆ కవిత్వ సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి విమల అయితే, ఆ పేరు చూసి కవిత్వంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో అని ఆశ్చర్యచకితులయ్యారు. ఆ సభలోనే విమల మాట్లా డుతూ ఒక్క లైనులోనే ఓ కవితను చెబుతున్న వారూ ఉన్నారన్నారు. ఇదీ నేటి కవిత్వ భాష. ఇక ప్రసేన్ అయితే తన మూడు కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు చూసి ఆ కవిత్వం చదవాలనిపిస్తుంది. (కొనాలనిపిం చదు. కొట్టేసి చదవాలనిపిస్తుంది). ప్రసేన్‌కు జర్నలిస్టుగా అనుభవం ఎక్కువే కాబట్టి, అక్కడ హెడ్డిం గులు పెట్టినట్టే తన కవిత్వ సంకలనాలకు కొత్తకొత్త పేర్లు పెట్టి పాఠకులను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారా యన. అంటూ కార్పొరేట్ ప్రకటనలు వస్తున్నాయి కానీ, తెలుగు కవిత్వాన్ని మాత్రం ఆ కవర్ పేజీ, ముఖ్యంగా ఆ సంకలనానికి పెట్టిన పేరుని బట్టే చదువుతున్నారు. అంతేకాదు.. పుస్తక ప్రదర్శనల్లో కొంటున్నారు కూడా. ప్రసేన్ తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కొందరికి కొత్తగా అనిపిస్తే%ొా% ఇంకొందరికి మాత్రం గమ్మత్తుగా అనిపించాయి. నాకు భలే నచ్చాయి ఆ పేర్లు. ప్రసేన్ రాసిన ఓ కవిత్వ సంకలనం పేరు 'ఇంకా వుంది'. సృజనకారులకు ఎందులోనూ ముగింపు ఉండదు. కవి అనండి, రచయిత్రి కానివ్వండి ఏది రాసినా అంతా అసంపూర్ణమే. వాళ్లు చెప్పేందుకు ఇంకా చాలానే ఉం టుంది. బహుశా అందుకు సంకేతమే ఈ 'ఇంకా వుంది'. ఇలాంటి తాత్వికతే మరో రెండు సంకలనాల టైటిళ్లలోనూ కనిపిస్తుంది. అందులో ఒకటి 'ఎవరికి వర్తి స్తే వారికి'. ఈ కవిత్వం చదవడానికి కాసింత ధైర్యం కావాలనిపిస్తుంది. ఆ సంకలనం తెరిస్తే 'మన గురించి, మనల్ని ఉద్దేశించి ఏమైనా రాశారా, మనల్ని మన అద్దం లో చూపించారా!? లేదా తన అద్దంలో చూపిం చారా!?' అనే సంశయం ప్రారంభమవుతుంది. ఏది కనిపించినా అది ఎవరికి వర్తిస్తే వారికి అలా సీనియర్ కవిగా గుర్తింపు పొందిన జూకంటి జగన్నా థం తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఉంటాయి, బాగుం టాయి. ఈ మధ్య ఖమ్మం ఈస్థటిక్స్‌వారు ఉత్తమ కవిత్వ సంకలనంగా జూకంటి రాసిన 'ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్ లు'కే ప్రకటించారు. ఈ సంకలనానికి అవార్డు ప్రకటించారని తెలియగానే తొలు త ఆశ్చర్యపోయాను. జూకంటి ఇప్పటి కవి కాదు. ఇంతకుముందు కూడా తన కవిత్వ సంపుటాలకు 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అని, 'వాస్కో డిగామా డాట్‌కామ్' అని సరికొత్త పేర్లు పెట్టారాయన. అంటే నేటి తరంతో నాటి జూకంటి అప్‌డేట్ అవుతు న్నారనిపించింది. ఊరికే పేరేనా లోపల విషయం ఉందా అని చూస్తే చాలానే ఉందనిపిస్తుంది. ఈ కప్పు చాయ్ పద్యం 'వన్నెల వెన్నెలని చూడలేదు/ ఉదార హృదయాన్ని కనలేదు' అంటూ ప్రారంభమై మధ్యలో 'ఏమరుపాటుగా కుర్చీలో కూర్చుని/ ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ/ సెల్‌లో ఎంగిలి మెసేజ్‌లు చదువుతూ/ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం/ కాకిలగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు' అంటారు. ఎంత గొప్పగా వెటకరించారు సెల్‌ఫోన్‌లే లోకంగా బతుకుతున్న నేటితరాన్ని. కవులే కాదు.. కవయిత్రులు కూడా తమ సంకలనాలకు సరికొత్త పేర్లు పెడుతూ పాఠకులకు చేరువవుతున్నారు. తోట సుభాషిణి 'ఒకటి ఒకటి పదకొండు', మందరపు హైమావతి 'రాతిచెయ్యి' కవిత్వ సంకలనాలు తీసుకొచ్చారు. తన కవిత్వ సంకల నాలకు 'లోహనది', 'మరో దశ' వంటి సీరియస్ పేర్లు పెట్టిన వసీరా మూడో సంకలనానికి మాత్రం 'సెల్ఫీ' అని నామకరణం చేశారు. ఇది తన మూడు దశాబ్దాల కవిత్వ ప్రయాణంలో తానే తీసుకున్న సెల్ఫీ. ఎప్పుడూ అచ్చమైన కవిత్వం రాసే పసునూరి శ్రీధర్‌బాబు 'నిద్రపోని మెలకువ చెప్పిన కల' అంటూ పొయెటిక్ సంకల్పం చెప్పుకొన్నారు తన కొత్త కవిత్వానికి. తెలుగు సాహిత్యంలో చాలామందికి గురుస్థానంలోకి వచ్చిన సీనియర్ కవి శివారెడ్డి అయితే పొసగనివన్నీ కలిపి ఓ కవిత్వ సంకలనం వేశారు. అది కూడా దశాబ్దంన్నర క్రితమే. అలాగే 'పక్కకు వొత్తిగిల్లితే' ఏం జరుగుతుందో కూడా శివారెడ్డే చెప్పారు. ఎనిమిది పదుల వయసులోకి వచ్చాక అసలు సిసలు ప్రేమని కనుగొని దానికి '%ానవ ఎశీ శాశీజవ% అను ప్రేమగీతం' పాడారు. ఇంకా చాలామంది తమ కొత్త శీర్షికలు, కవిత్వ సంకలనాల పేర్లతో తెలుగు కవిత్వాన్ని వినిపిస్తున్నారు. 'పేరులోన ఏముంది' అన్నమాట కాదు నేడు వినిపిస్తున్నది.. 'పేరులోనే అంతా ఉంది' అన్నదే నేడు వినిపిస్తున్న కవిత్వం.

# ఆత్మ నివేదన

గత 127 వారాలుగా 'కాశీమజిలీ కథలు' అనుసృజనను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు. 1930వ దశకంలో 12 భాగాలుగా మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల విశిష్టతను గురించి, ఈ అనుసృజనలో ఆ కథలను చెప్పేందుకు అనుసరించిన నిబంధనలను గురించి క్లుప్తంగా తెలియచేస్తూ.. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. తెలుగులో కాశీమజిలీ కథలకున్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. సంసార వ్యామోహాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన మణిసిద్ధుడు అనే యతి.. కాశీయాత్ర చేయాలని నిశ్చయించుకుంటాడు. అయితే యాత్రలకు ఒంటరిగా వెళ్లరాదనే నియమాన్ని పురస్కరించుకుని, తనకు తోడుగా రమ్మని ఒక గోపాలకుణ్ని కోరుతాడు. కథలంటే మక్కువ కలిగిన ఆ గోపాలకుడు.. 'దారిలో కనిపించే విశేషాలన్నిటినీ నాకు విడమరిచి చెబితేనే మీతో వస్తా!' అని షరతు పెట్టాడు. మణిసిద్ధుని వద్ద ఒక అపురూపమైన మణి ఉంది. దాని సాయంతో దారిలో కనిపించిన ప్రతి విశేషాన్ని తెలుసుకుని, ఎప్పటికప్పుడు మణిసిద్ధుడు ఆ గోపాలకుడికి కథలు కథలుగా చెబుతాడు. అవే కాశీ మజిలీ కథలు. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షిత కవి రచించిన కాశీమజిలీ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా, పండిత పామరులనే భేదం లేకుండా.. ఒకప్పుడు తెలుగు వారందరూ కాశీమజిలీ కథలను ఆస్వాదించినవారే! పూర్తి జానపద శైలితో సాగినప్పటికీ, సామాన్యులకు అంతగా రుచించని వేదాంత, వ్యాకరణాది అంశాలను పరమార్థ బోధారూపంగా అందించిన అద్వితీయ రచన కాశీమజిలీ కథలు. మధిర సుబ్బన్న దీక్షితులు ఈ కథలను రచించేనాటికి తెలుగులో నవలలు లేవు. చిన్నవైనా, పెద్దవైనా కథలు మాత్రమే! కాశీమజిలీ కథల్లో 359 మజిలీలు ఉంటాయి. ఆ మజిలీలన్నిటిలో 'కథ' అనే పేరు కనిపిస్తుంది. లెక్కకు మిక్కిలిగా కథలుంటాయి. ఉదాహరణకు మొదటి సంపుటంలో వరప్రసాదుల కథ ఉంటుంది. ఇది అయిదుగురు స్నేహితుల కథ. ప్రధాన కథ ఇదే అయినప్పటికీ.. వేర్వేరు శీర్షికలకు కూడా కథ అనే పేరుతోనే పేర్కొన్నారు. ఈ అనుసృజనలో ప్రతిభాగానికీ వేర్వేరు శీర్షికలను ఉంచినప్పటికీ ప్రధాన కథ ప్రారంభాన్ని, ముగింపునీ తప్పనిసరిగా తెలియచేశాం. ఆవిధంగా చూస్తే ఇప్పటివరకు 28 కథలను మీరు చదివారు. ఇంకా మిగిలిన కథలేమయ్యాయి?! వాటిని ఎందుకు చెప్పలేదు!? అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా స్మరించాల్సి ఉంది. కాశీమజిలీల్లో ప్రధాన కథ ఎప్పుడూ మణిసిద్ధుడనే యతి.. గోపాలకుడనే సహాయకుడికి బోధించినట్లుగా మొదలవుతుంది. కథలో చర్చించబోయే విషయాన్ని నాటకఫక్కీలో ముందుగా వారిద్దరి మాటల్లో చర్చించారు. అయితే ఈ అనుసృజనలో వారిద్దరి పాత్రలనూ పక్కన పెట్టినప్పటికీ అసలు స్మరించకుండా ఉండలేదు. ఇక, వరప్రసాదుల కథలోనే కృష్ణదేవరాయల వృత్తాంతం ఇమిడి ఉంటుంది. కృష్ణరాయని కథను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దిన రచయిత, అందులోనే తిమ్మరుసు కథ, గజపతులతో సంబంధం వగైరా కథలను హేతుబద్ధంగానూ, చరిత్రకు అందే విధంగానూ రచించారు. అయినప్పటికీ ఈ అనుసృజనలో చారిత్రక పురుషులపై వచ్చిన కథలను తప్పించడం జరిగింది. కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితులు.. 1. జానపద ఇతివృత్తాలు, 2. చారిత్రక ఇతివృత్తాలు, 3. కావ్యకథలు, 4. పౌరాణిక కథలు అనే విభాగాల నుంచి స్వీకరించి రచించారు. ఇందులో ఇప్పటివరకు మనం జానపద ఇతివృత్తాలను మాత్రమే చదువుకున్నాం. కృష్ణరాయని కథతో పాటుగా.. జగన్నాథ పండితరాయలు, తెనాలి రామలింగడు వంటి చారిత్రక పురుషుల కథలను అప్పటి పండిత పామరులను రంజింపచేసే విధంగా సుబ్బన్న దీక్షితులు రచించారు. అవి ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి బాగుంటాయి. జనబాహుళ్యాన్ని కాస్త తికమక పెడతాయి. కనుకనే వాటిని విడిచిపెట్టడం జరిగింది. రెండో సంపుటంలో పూరీ జగన్నాథుని అవతార నేపథ్యానికి సంబంధించిన ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతాన్ని యథాతథంగా వర్ణించాం. 8వ సంపుటిలోని పౌరాణికమైన మదాలస కథను చెప్పాం. పురాణ పాత్రల నేపథ్యాలతో వచ్చిన మరికొన్ని కథలనూ చెప్పాం. విక్రమార్కుడు ఉట్టికోసిన కథ, భేతాళుని వశం చేసుకున్న కథ ఒక క్రమపద్ధతిలో లేవు. అవన్నీ ఇతరత్ర బహుళ ప్రాచుర్యంలో ఉన్నవే. కాశీమజిలీల్లోనివే అయిన విక్రమార్కుని మనుమని కథను చదువుకున్నాం. కానీ, అతను పాతాళానికి వెళ్లి విభీషణుడు మొదలైన రాక్షసులను కలుసుకోవడం వగైరా కథలను నేటితరం వారికి ఓ పట్టాన కొరుకుడు పడవు కనుక, విడిచిపెట్టాం. వీణావిద్వాంసుని కథ చాలా చిన్నదే కానీ, మజా కలిగించే కథ కాదు. నాలుగు కులాలకు చెందిన నలుగురు కన్యలు ఒకే వరుణ్ని వరించిన కథను కూడా ఈ శీర్షికలో చెప్పలేదు. 5వ సంపుటిలోని శంకరవిజయాన్ని ఈ అనుసృజనకారుడు గతంలో నవలగా రచించారు. కనుక ఇక్కడ మళ్లీ చెప్పలేదు. అలాగే అదే సంపుటిలోని కాదంబరి అనే కావ్యకథను కూడా విడిచిపెట్టాం. ఈ అనుసృజనలో మూలంలోని వర్ణనాసౌందర్యాన్ని చెడగొట్టలేదు. ఏ ముఖ్యవిషయాలు చెప్పడం ద్వారా పాఠకుల స్థాయి పెరిగేలా మూలకర్త వాటిని రచించారో.. వాటిని చెప్పకుండా వదిలి పెట్టలేదు. కాశీమజిలీ కథలకు రెండో మూడో సరళ అనువాదాలు వచ్చాయి. ఇందులోని అనేక కథలను విఠలాచార్య వంటివారు పలు సినిమాల్లో ఉపయోగించుకున్నారు. జగదేకవీరుని కథ, చిక్కడు దొరకడు.. వంటి హిట్ సినిమాలు కాశీమజిలీల్లోని ముఖ్యమైన థాట్‌ని ఉపయోగించుకుని చేసిన కథలే. కాశీమజిలీలను రూపొందించడంలో మధిర సుబ్బన్న దీక్షితకవి చూపించిన రచనా నైపుణ్యం అనితర సాధ్యం. అయినప్పటికీ ప్రతికథకూ ప్రాచీన సాహిత్యపు మూలాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రధానంగా కథాసరిత్సాగరం కనిపిస్తుంది. అలాగే సంస్కృత కావ్యాలలోని కథలను తనదైన భాషలోకి మలుచుకుని, గమ్మత్తయిన మలుపులతో మధిర సుబ్బన్న దీక్షితులు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించారు. నేటికీ ఈ కథలు వీటికివే సాటి అని చెప్పుకోవాలి. ఈ అనుసృజనకు ఇది చివరి భాగం. కాశీమజిలీల్లోని తొలిభాగం మణిసిద్ధుడనే యతికి, గోపాలకుడికి మధ్య సంభాషణతో మొదలు అవుతుంది. 12వ సంపుటిలో కాశీమాహాత్మ్య గాథలుంటాయి. అవన్నీ మన పౌరాణికాలను పరమార్థ బోధారూపంగా చెప్పినవి. కాశీఖండం నుంచి స్వీకరించిన దివోదాసు కథ ప్రత్యేకంగా ఇందులో వర్ణించారు. ఈ కథ పద్మకల్పంలోని స్వాయంభువ మనువు కాలానికి చెందినది. అప్పట్లో అరవై ఏళ్లపాటు భూమిపై అనావృష్టి సంభవించింది. పాడిపంటలు నశించాయి. ప్రజలు విశూచి, మశూచి మొదలైన దారుణ రోగాలపాలయ్యారు. ప్రజలు కోటానుకోట్లుగా మరణిస్తుండగా, యమధర్మరాజు విసిగిపోసాగాడు. యజ్ఞయాగాదికాలు చెడ్డాయి. మానవులకు కలుగుతున్న అన్యాయానికి ఇంద్రాదులను నిలవేసి అడిగేవారే కరవయ్యారు. ఈ విశేషాలన్నీ నారదుడి వల్ల విన్న బ్రహ్మదేవుడు.. స్వాయంభువ మనువు వంశంలో పుట్టిన రిపుంజయుణ్ని ధరణీచక్రాన్ని పాలించవలసిందిగా నియమించాడు. రిపుంజయుని పేరును దివోదాసుగా మార్చాడు. అయితే దివోదాసు ఒక షరతు పెట్టాడు. "దేవతలకు స్వర్గం, నాగులకు పాతాళం ఉండగా.. వారు ఈ భూమిమీద ఎందుకు సంచరించాలి? వాళ్లు భూమి వదిలిపోవాలి. నేను కాశీని రాజధానిగా పాలిస్తాను.. కనుక శివుడు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలి" అన్నాడు. బ్రహ్మదేవుడు అతని కోరికను శివునికి విన్నవించగా.. "బ్రహ్మా! నీవు చేసిన నిర్ణయానికి కట్టుబడి.. నేను మందర పర్వతానికి వెళ్లిపోతాను. నేను తిరిగి వచ్చేదాకా ఈ ధరణీచక్రాన్ని దివోదాసుడే ఏలనీ" అన్నాడు. దివోదాసు అధికారం చేపట్టగానే నేలపై పాతాళవాసులను తరిమికొట్టాడు. తన బలంతో వర్షదేవతలను శాసించి వర్షాలు కురిపించాడు. దాంతో భూమి సస్యశ్యామలమైంది. నేలపై ధర్మం నాలుగు పాదాలతో నడవ సాగింది. కొంతకాలం జరిగిన పిమ్మట దివోదాసు రాజ్యంలో పుట్టలోని పామువల్ల పుత్రుణ్ని పోగొట్టుకున్న ఆటవికులు న్యాయంకోసం అతని వద్దకు వచ్చారు. వారికి ఆ పుత్రుణ్ని తిరిగి ఇచ్చే నిమిత్తం.. దివోదాసు కథంతా చిత్రవిచిత్రాలతో సుబ్బన్న దీక్షితులుగారి శైలిలో సుందరంగా సాగుతుంది. ఆ కథలో భాగంగా రసాతలం నుంచి నాగులు, యక్షులు మొదలైనవారంతా భూమిపై నివసించడానికి తగిన అనుమతిని దివోదాసు మంజూరు చేశాడు. కానీ, దేవతలను మాత్రం రానివ్వలేదు. కాశీని విడిచి ఉండటం ఇష్టంలేని దేవతలు బృహస్పతికి మొరపెట్టుకున్నారు. ఆయన సూచన మేరకు భూలోకంలో అగ్నిదేవుడు తన తత్వాన్ని ఉపసంహరించాడు. వాయువు స్తంభించాడు. వరుణుడు వర్షించడం మానేశాడు. దేవతల కపటం గ్రహించిన దివోదాసు, తన యోగవిద్యాబలంతో తానే సర్వదేవతామయునిగా మారిపోయాడు. రాజ్యాన్ని ఎప్పటిలా పాలించసాగాడు. కాశీనగరం శివుని నివాసభూమి. ఆయన కాశీవియోగాన్ని సహించలేక ముందుగా అరవైనాలుగు మంది యోగినీస్త్రీలను కాశీకి పంపాడు. వారు కాశీలో స్థిరపడిపోయారు. ఆలస్యం భరించలేక, శివుడు తరువాత సూర్యుడిని పిలిచాడు. "దివోదాసును ఏదోవిధంగా ధర్మవిముఖుడిని చేయి" అని కోరాడు. కానీ ఆ పని సూర్యుడివల్ల కూడా కాలేదు. అటుపై ఈశ్వరుని ఆజ్ఞపై బ్రహ్మ బ్రాహ్మణ వేషంలో కాశీకి వెళ్లి.. దశాశ్వమేధ యాగాలతో ఈశ్వరుడిని ప్రతిష్ఠించి.. గంగానదికి పడమటి తీరంలో ఉండసాగాడు. కానీ, కాశీని విడిచిపెట్టి వెనక్కు రాలేకపోయాడు. ఆ తరువాత ప్రమథులు కూడా వెళ్లి.. ఆ క్షేత్రంలోని అద్భుతానందాన్ని అనుభవిస్తూ అక్కడే ఉండిపోయారు. అప్పుడు డుంఠి భట్టారకుడై గణపతి వెళ్లాడు. అతడు కాశీవాసులకు అనేక దుశ్శకునాలు కల్పిస్తూ, వాటికి శాంతులు కూడా తెలియచేయసాగాడు. ఒకనాడు డుంఠి భట్టారకుని దర్శనానికి దివోదాసు వెళ్లాడు. "కాశీ ప్రజలకు ఉత్పాతాలు రావడానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు. అప్పుడు భట్టారకుడు.. "ఇటుపైన ఇంకా ఉత్పాతాలు రావడానికి అవకాశముంది. వాటిని నేను ఉపశమింప చేయగలను. కానీ, నువ్వు ఇక్కడ ఉండటం మంచిదికాదు. నేటికి పద్దెనిమిదో రోజున నీకోసం ఒక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు చెప్పినట్లుగా చేయి" అని సూచించాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ పద్దెనిమిది రోజులలో చాలా వింతలు జరిగాయి. విష్ణువే లక్ష్మీ గరుడ సమేతంగా దిగివచ్చాడు. వాళ్ల బోధలతో అధర్మం పెచ్చుపెరిగి పోయింది. పద్దెనిమిదో రోజున మధుసూదనుడు బ్రాహ్మణ వేషంలో దివోదాసుని కలుసుకున్నాడు. అప్పుడు విఘ్నేశ్వరుడు రాజు హృదయాన్ని ఆవేశించి ఉన్నాడు. "ఇన్నాళ్లూ నా రాజ్యంలో అకాల మరణాలు, వ్యాధులు, దారిద్ర్యం, ముసలితనం లేవు. ఎందుకో అవన్నీ ఇప్పుడు కలుగుతున్నాయి. నేను దేవతలను తృణీకరించిన అపరాధం తప్ప మరే దోషమూ ఎరుగను. ఇదంతా దేవతలు కల్పించిన నాటకంలా కనిపిస్తున్నది. ఏదేమైనా నేను చాలాకాలం రాజ్యం చేశాను. నా ఇంద్రియాలు విశ్రాంతి కోరుతున్నాయి. నేను మోక్షం కోరుకుంటున్నాను. ఏం చేయాలో సెలవియ్యండి" అని కోరాడు దివోదాసుడు. ఆపైన మధుసూదనుడు చెప్పినట్లుగా, కాశీలో లింగప్రతిష్ఠ చేశాడు. తన కొడుక్కి పట్టాభిషేకం చేసి, దైవభక్తిని ఉపదేశించాడు. తాను తపోవనానికి వెళ్లిపోయాడు. దివోదాసు వారణాసి వదిలేసి వెళ్లాడన్న వార్త విష్ణువు ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు తిరిగి వచ్చాడు. ఆయనతోపాటు సర్వదేవతలూ కాశీ చేరుకున్నారు. ఆనాటినుంచి ఈ భూమండలాన్ని దేవతలే పాలిస్తారని విశ్వేశ్వరుడు ప్రకటించాడు. దివోదాసు కథ తరువాత, కాశీమజిలీ కథల్లోని 12వ సంపుటిలో.. పుండరీకుని కథను వర్ణించారు. ఈ కథ మనందరం ఎరిగిన పాండురంగ మహత్యాన్ని చాటే పుండరీకుని కథ కాదు. వైకుంఠ సభలో ఈశ్వరుడి చేత శపించబడిన ఇంద్ర, చంద్రులు.. పుండరీక, కుమారకేసరులుగా జన్మించారు. పార్వతీదేవి శాపం వల్ల అహల్య, తార పాతాళంలో ఉదయసుందరి, తారావళులుగా పుట్టి, భూలోకంలో అనేక కష్టాలు పడ్డారు. పుండరీక, కుమారకేసరులను పెళ్లాడారు. వాళ్లే తరువాతి జన్మలో గంధర్వలోకంలో హంసుడికి మహాశ్వేతగా, చిత్రరథుడికి కాదంబరిగా.. ఈశ్వరుడి వరం వల్ల జన్మించారు. ఇంద్రచంద్రుల మరో రూపాలైన చంద్రాపీడ, పుండరీకులని వివాహమాడి సంతానం పొందగానే వారి శాపం తొలగిపోయింది. చంద్రుడి భార్య అయిన రోహిణి కూడా అతణ్ని మూడు జన్మలలోనూ అనుసరించింది. కాశీమజిలీల్లో అటుపైన వైశ్వానర, నిర్భతి, వరుణుడు మొదలైన దిక్పతుల పూర్వగాథలు ఉంటాయి. చివరిగా మణిసిద్ధుడు, గోపాలుడు కాశీపుర ప్రవేశం చేసి, అక్కడే స్థిరపడడంతో పన్నెండో భాగం పరిసమాప్తమైంది.




# తెలుగు భాషపై చిన్నచూపు



వేల ఏండ్ల నుంచే తెలుగు భాష ఉన్నదనడానికి నిలువెత్తు సాక్ష్యం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలోని బొమ్మలమ్మగుట్టపై ఉన్న కురిక్యాల శాసనం. 2008, అక్టోబర్ 31న నాటి కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించడానికి ఈ 'కురిక్యాల శాసనం' చాలా దోహదపడింది. ఈ శాసనాన్ని జినవల్లభుడు క్రీ.శ.945లోనే వేయించినట్టు చరిత్ర చెప్తున్నది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ రాష్ట్రంలో పాలనాపరంగా మాతృభాష సంపూర్ణంగా అమలుకాకపోవడం భాషాభిమానులను ఆశ్చర్యాన్ని గురిచేస్తున్నది. పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే తెలుగును పాఠ్యాంశంగా చూడటం కడు శోచనీయం. ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు భాష పూర్తిగా కనుమరుగైపోయింది. 90 శాతం ప్రైవేటు కళాశాలలు సంస్కృతాన్నే ప్రోత్సహిస్తున్నాయి. ఇదిలాగే కొనసాగితే మాతృభాష మాట్లాడుకోవడానికి మాత్రమే మిగిలిపోతుంది. పుస్తకాల్లో, మస్తకాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకానందుకు బాధపడాలో, సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషను ఎక్కువగా వాడుతున్నందుకు సం తోషపడాలో అర్థం కావడం లేదు. ఇదిలా ఉంటే సినిమా పేర్లను కూడా తెలుగులో పెట్టకుండా దేశంలోని ఇతర భాషల్లో వాడుతుండటం నిజంగా తెలుగు భాషను కించపరుస్తున్నట్టే లెక్క. ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్టు ఇలాగే వ్యవహరిస్తే%ా% మాతృభాష అయిన తెలుగు భాష కొన్ని రోజుల్లో మృతభాషగా అవుతుందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి.

# అడవుల రక్షణ బాధ్యత ఆదివాసీలదేనా?



దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీల అభ్యున్నతే వీటి లక్ష్యం. కానీ, పాలకులు ఆ చట్టాలను అమలు చేయడం లేదు. కొద్ది నెలలుగా మధ్య భారతదేశంలో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద పెద్దఎత్తున అణచివేత కొనసాగుతున్నది. ఆదివాసీ గూడెంల సమీపంలో వందలాది పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. మూలవాసీ బచావో మంచ్ నాయకుడు రఘు మాటల్లో ఈ దేశ వనరులను కాపాడేందుకు ఆదివాసులు చేస్తున్న పోరాటాన్ని మిగతా సమాజం పట్టించుకోవడం లేదు. ఇది ఆదివాసీలకు సంబంధించిన సమస్యగా అందరూ చూస్తున్నారు. 1980 నుంచి మావోయిస్టులు ఆదివాసీ సమాజంలోకి, దండకారణ్యంలోకి ప్రవేశించి అక్కడ జరిగే అమానుషం, ఫారెస్టు వాళ్ల దోపిడీలను అరికట్టడం కోసం కృషి చేశారు. కానీ, 1993లో ప్రత్యేక చట్టం వచ్చాక దండకారణ్యంలోని కోట్లాది విలువైన వనరులపై కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారుల కన్నుపడింది. వనరుల దోపిడీకి ఆదివాసుల భూములను ఆక్రమించేందుకు నాటి నుంచి నేటి వరకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు మావోయిస్టులు మద్దతుగా ఉన్నందుకే 2005లో సల్వాజుడుం మారణ హోమాన్ని సృష్టించారు. ఐదేండ్లలో మూడు వేల గ్రామాలను దగ్ధం చేశారు. 450 మందిని అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ క్రమంలోనే ఎర్రబోరు, డోర్నపాలు, కుంట ప్రాంతాల్లో సల్వాజుడుం బేస్ క్యాంప్‌లుగా మార్చి ఒక్కొక్క క్యాంపులో 50 వేలకు పైగా ఆదివాసీలను నిర్బంధించిన స్థితిని మనందరం చూశాం. చివరికి ప్రొఫెసర్ నందిని సుందర్ పోరాటం, జస్టిస్ సుదర్శన్ తీర్పు కారణంగా సల్వాజుడుం రద్దయిందేమో కానీ, దాని మరొక రూపం డీఆర్‌జీ నేటికీ వేటాడుతూనే ఉన్నది. ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడినందుకు సునీత పొట్టం అనే ఆదివాసీ, మూలవాసీ బచావో మంచ్ నాయకురాలిని బలవంతంగా అరెస్టు చేశారు. అదేవిధంగా 2021 నుంచి సిలింగేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులకు వ్యతిరేకంగా మూలవాసీ బచావో మంచ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆదివాసులందరూ మావోయిస్టులేననే దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తున్నది. ఈ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడుతున్న హక్కుల నేతలను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. ఆదివాసీల సమస్యల గురించి ఎవరూ మాట్లాడొద్దా? ఇదే విధంగా సోనిసూరీ అనే ఆదివాసీ హక్కుల కార్యకర్తను నిర్బంధించారు. చనిపోయిన భర్తను చూసేందుకు కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో కగార్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్నాయి. ప్రభుత్వాలే దళారీగా మారి పెట్టుబడిదారులకు సహజ వనరులను అప్పగించడం దారుణం. 2009లో మావోయిస్టు పార్టీ దేశానికి ప్రమాదకరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. చెప్పినట్టే ఏకపక్ష దాడులకు దిగారు. సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు మధ్యభారతంలోకి ప్రవేశించాయి. అదే ఇప్పుడు ఆపరేషన్ కగార్‌గా మారింది. ఇప్పుడు దంతెవాడ, బస్తర్ ప్రాంతాలతో పాటు బీజాపూర్ జిల్లా కూడా ఇనుప ఖనిజపు పుట్టినిల్లుగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు ఒక స్టీల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం 2005లో ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి తోడు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు పనిచేస్తున్నది. కంపెనీలతో జరిగిన ఒప్పందాల వల్లనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతున్నది. తద్వారా ప్రజలను చంపైనా సరే వనరులను అప్పగించాలనే స్థితికి ప్రభుత్వాలు చేరిపోయాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నందున వాటిని అణచివేసేందుకు అనేక రకాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఆదివాసీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, 2017లో ఆపరేషన్ సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యాకాండ కొనసాగుతున్నది. వేలాది మంది ఆదివాసీలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఏడాది జనవరి 1న బీజాపూర్ జిల్లా ముగ్ధుం గ్రామానికి చెందిన 6 నెలల సోడి మంగ్లీతో మొదలైన హత్యాకాండ 275కు చేరింది. తెలంగాణలోనూ సెప్టెంబర్ 5న రఘునాథపాలెంలో ఏడుగురిని హతమార్చారు. డిసెంబర్ 1న ఆరుగురికి విషం పెట్టి మరీ కాల్చిచంపారు. కనీసం ఆ మరణాలపై సత్యశోధన చేయడానికి కూడా ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నిషేధిత ప్రాంతంగా మారిపోయింది. హక్కుల సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ కాలంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదు. అందుకే ప్రజలు స్పందించాలని కురుసం శంకర్, రఘు లాంటి మేధావులు కోరుతున్నారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేతలు ఎన్నడికీ విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమమే అందుకు నిదర్శనం. మావోయిస్టుల సాకుతో ఆదివాసీలను నిర్బంధిస్తే ఉద్యమాలు ఆగవు. ప్రజాస్వామిక పోరాటాలను నిషేధించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. పాలించే నైతిక హక్కును పాలకులు కోల్పోతారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధం ఎత్తివేయాలి. మరీ ముఖ్యంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది. ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ పట్ల ప్రజల నుంచి మద్దతు దక్కని పక్షంలోనే ప్రభుత్వాలు అత్యంత దారుణంగా నరమేధాన్ని సృష్టిస్తాయి. ఈ విధానాన్ని మనమంతా ఖండించాలి. దేశ మూలవాసులైన ఆదివాసుల జీవించే హక్కును కాపాడుదాం. ఆపరేషన్ కగార్, ఆదివాసీ హననానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం.

# అనగనగా పెద్ద కథ!





**తెలుగు సాహిత్య ప్రపంచంలో కథ లేదా కథా సాహిత్యానికి ఒక విశిష్ట స్థానం ఉన్నది. 'కథ'ను అనగనగా అని మొదలుపెట్టి 'కథ కంచికి మనం ఇంటికి' అంటూ కథను ముగించడం తెలుగు కథకుల అలవాటు.**

'నిజ జీవితం ఆధారంగా అల్లబడిన సంఘటనల సమాహారం కథ' అని కొందరు, 'కల్పిత ప్రపంచ సమాహారం కథ' అని మరికొందరు కథకు రకరకాల నిర్వచనాలను ఇచ్చారు. కథలో ఉండాల్సిన నీతి విస్తృతం, ఎత్తుగడ, సంవేదన, నడక తీరు, ముగింపు, పరిమిత పాత్రలు, పాత్ర స్వభావాలు, ఏక వస్తు స్వరూపతల గురించి బొడ్డపాటి కుటుంబరాయ శర్మ, జె.నాగయ్య, పోరంకి దక్షిణామూర్తి వంటి అనేకమంది పండితులు అనేకరకాల అభిప్రాయాలను తెలియజేశారు. 'అనగనగా..' అంటే నిజంగా 'చాలాకాలం కిందట' అనే అర్థమేనా? కొంచెం తెలివితేటలు కలిగిన విద్యార్థి 'అనగనగా ఒక పిల్లి ఉంది అంటే చాలాకాలం కిందట ఒక పిల్లి ఉంది' అని అర్థం చెప్పుకోవాలా?, అలాగే 'అనగనగా ఒక రాజు అంటే చాలాకాలం కిందట ఒక రాజే ఉన్నాడని చెప్పుకోవాలా' అని ప్రశ్నిస్తే'అది అంతేలేరా' అని కొందరు గురువులు మృదువుగా మందలిస్తే, మరికొందరు గురువులు పిదప కాలం బుద్ధులు. దిక్కుమాలిన సందేహాలు అని విసుక్కుంటారు. ఏదేమైనా 'కథ్' అనే సం స్కృత ధాతువు నుంచి 'కథ' అనే పదం పుట్టింది. 'చెప్పు ట, సంభాషించుట' అని దీనికి అర్థాలుగా చెప్పవచ్చు. కథల్లో ఇతి వృత్తాన్ని బట్టి పురాణ కథలు, శృం గార కథలు, హాస్యకథలు, క్రైం కథ లు, రాజకీయ కథలు, అభ్యుదయ కథలు, స్త్రీవాద కథలు, దళిత కథలు వంటివి అనేకం ఉన్నాయి. ప్రాచుర్యాన్ని బట్టి చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పంచతంత్ర కథలు, విక్రమార్క కథలు, కాశీమజిలీ కథలు, బేతాళ కథలు, తాతమ్మ కథలు, పిట్ట కథలు వంటి వాటితో పాటు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకంగా తెనాలి రామకృష్ణ కథల వంటి హాస్య కథలున్నాయి. ఇంకా హరి కథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, సైన్స్ కథలు, పొడు పు కథల వంటి అనేకరకాల కథలున్నాయి. ఈ ఆధుని క కాలంలో సినిమా కథల వంటివి కూడా ఉన్నాయి. తెలుగు కథలకు నిలయమైన 'కథా నిలయం' అనే పేరు గల గ్రంథాలయాన్ని 1997 ఫిబ్రవరి 22న శ్రీకాకుళంలో కాళీపట్నం రామారావు స్థాపించారు. తిక్కన శిష్యుడైన కేతన రాసిన 'దశకుమార చరిత్ర' కథా కావ్యం కాగా ఆధునిక కాలంలో గురజాడ వేంకట అప్పారావు రాసిన 'దిద్దుబాటు' అనే కథ తెలుగులో తొలి కథ అని అంటారు. ఇక బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడ అప్పారావు కంటే ముందే కథా రచనకు శ్రీకారం చుట్టారు. ఆపై వేలూరి శివరామ శాస్త్రి, కొమర్రాజు వెం కటలక్ష్మణరావు, చింతా దీక్షితులు, కాళోజీ, చలం, బోయినపల్లి రంగారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ముని మాణిక్యం, బోయ జంగయ్య, పులిపాటి గురుస్వామి, అల్లం రాజయ్య, అడవి బాపిరాజు, భమిడిపాటి కామేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, పీవీ, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, గూడూరి సీతారాం, సామల, యశోదారెడ్డి, అఫ్సర్, ముళ్లపూడి వెం కటరమణ, మంజుశ్రీ, చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, హితశ్రీ, కొలకలూరి ఇనాక్, కాలువ మల్లయ్య, వాకాటి పాండురంగారావు, భానుమతి, చెరబండరాజు, ఓల్గా, హుమాయూన్ సం ఘీర్, ధీరజ్ కశ్యప్, వేముగంటి.. ఇలా చెప్పుకొంటూ పోతే తెలుగు కథా రచయితల నామధేయాలే చిన్నపాటి గ్రంథం అవుతుంది. నాడు చిన్న పిల్లలు నిద్రపోవడానికి తల్లిదండ్రులు లేదా నానమ్మ తాతయ్యాదులు చిన్నచిన్న కతలు చెప్పేవారు. తెలుగునాట ఎవరైనా సరే చిన్న పిల్లలకు, పెద్దలకు కథ చెప్పేటప్పుడు 'అనగనగ..' అని మొదలుపెడతారు. చిన్న పిల్లల్లో కథ అనగానే ముందుగా కథ వినాలనే ఉత్సాహం ఉంటుంది. కానీ, ప్రశ్నించే తత్వం ఉం డదు. ఏది నిజం, ఏది అబద్ధం అనే ఆలోచనా జ్ఞానం ఉండదు. కల్పనా ప్రపంచంలో విహరించాలి అంతే. కొందరికి కథ కునుకు పట్టిస్తుంది కానీ, ఇది నిజం, ఇది అబ ద్ధం అనే ఆలోచనలను పెంచదు. కథ ల్లోని వాస్తవ, అవాస్తవాలను పక్కకు నెట్టేసి మనసును దేవుని మీదికి పోయేటట్టు చేస్తాయి గుడిలోని హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథల వంటి కథలు. ఇక బడిలోని కథల గురించి చెప్పాలంటే.. అవి మంచిని, మానవత్వాన్ని, నీతిని, పెద్దల ఆదర్శాలను, చదువును సంస్కారాన్ని, సృజనాత్మకతను, సశాస్త్రీయ పథాన్ని తెలియజేసేవిగా ఉంటాయా? ఉన్నాయా? ఉండాలా? అంటే సమాధానం ఉండాలనే ఎక్కువగా వస్తుంది. నేడు సినిమా కథలే ఎక్కువగా కోట్ల వ్యాపారాల నడుమ ప్రకాశిస్తున్నాయి. కొందరు సినిమా కథలో ఏదో ఒక నీతి ఉండాలి, లేదా సమాజానికి ఉపయోగపడే ఏదో ఒక సందేశం ఉం డాలంటున్నారు. అయితే మాట ఒకరకంగా ఉంటుంది. చేత మరొకరకంగా ఉంటుంది. సహజంగా ఉపాధ్యాయులు గానీ, పెద్దలు గానీ, పిల్లలు కానీ కథ మొదలు పెట్టేటప్పుడు 'అనగన గా..' అని అంటారు. అనగనగా అంటే ఏమిటంటే పూర్వం, చాలాకాలం కిందట వంటి అర్థాలను చెప్తా రు. ఇంగ్లీష్‌లో కూడా కథ మొదలు పెట్టేటప్పుడు అని అంటారు. అది 'అనగనగా' కు ఆంగ్ల రూపం అనే చెప్పవచ్చు. నిజానికి కథ మొదలు పెట్టేటప్పుడు ముందుగా అనవలసింది 'అనగనగా?' అని కాదు, 'అనఘనఘ' అని అనాలి. వాడుకలో మహా ప్రాణాక్షరం ఘ..గ..గ మారిపోయి అనగనగా అయ్యింది. దానికి చాలాకాలం కిందట అనే అర్థం ఊహించి చెప్పబడింది. నిజానికి అనగనగా అంటే పదబంధం ప్రకారం చెప్పగ చెప్పెగ అనే అర్థాన్ని చెప్పాలి. కానీ అలా చెప్ప డం లేదు. నిజానికి అఘం అంటే పాపం అని అర్థం. అనఘం అంటే పాపం కానిది పుణ్యం అని అర్థం. అనఘ అంటే ఓ పుణ్యాత్ముడని అర్థం. అనఘనఘ అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని అర్థం. హరికథలు, బుర్రకథలు వంటివి చెప్పేటప్పుడు మాన్యులు, మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములని సంబోధిస్తుంటారు. అలాగే కథ చెప్పేటప్పుడు కూడా 'ఓ ఓ పుణ్యాత్ముల్లారా' అని కథ చెప్పేవారు వినేవారిని సం బోధిస్తారు. ఆ ఉద్దేశంతోనే అనఘనఘ అనే పదబంధాన్ని పూర్వం సృష్టించారు. కానీ, ఉచ్చారణ ఆ పద బంధ అర్థానికే ప్రమాదం తెచ్చింది. ఎందరెందరో మహానుభావులు కథలు రాశారు, చెప్పారు. మంచి పేరు తెచ్చుకున్నారు. కథలు చెప్పేది పెద్దలు, వినేది పిల్లలు అంతే అనే దృష్టితో 'అనఘనఘ'ని 'అనగనగ' చేసి 'లాంగ్ లాంగ్ ఎగో' అని ఆంగ్ల భాషా పండితుల చేత కూడా మన పండితులు అనిపించేశారు. హరికథలు, బుర్రకథలు చెప్పేవారు ఇప్పటికీ వినేవారిలో చిన్నారులున్నా, పెద్దలున్నా, ఎవరున్నా మాన్యులు మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములు అనే పదాలనే ప్రయోగిస్తుంటారు. కథ చెప్పేటప్పుడు కూ డా అనఘనఘ అనే కథ ప్రారంభించాలి. అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని కథ వినేవారిని సంబోధించడం. తెలుగు సాహిత్యం లో మంచి మంచి అర్థాలతో ఇలాంటి పద ప్రయోగాలు కొన్ని ఉన్నాయి. వాటి అర్థం తెలుసుకొని ప్రయోగిస్తే మనం చెప్పే విష యం మహా అర్థవంతంగా ఉంటుంది.

# అతడి పాట కన్నీటి ఊట

ఆ పాట విన్నవారెవరైనా కంటి నుంచి నీళ్లు తీయకుండా ఉండలేరు. ఆ వాగ్గేయకారుడు రాసి, పాడిన పాటలు విన్న విద్యాశాఖాధికారులు రాష్ట్రంలోని రెండు లక్షల బాల కార్మికులను బడిలో చేర్పించారు. అంతెందుకు ఆ పాట విన్న ప్రభుత్వం సైతం రాష్ట్రంలో అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు కృషిచేసింది. ఆ రచయితే చింతల యాదగిరి. ఆయన పాడిన పాటే 'నా చిట్టీ చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో/ నా సంకల మేడితో సాలిరువాలు దున్నినానయ్యో'. చింతల యాదగిరి నల్లగొండ జిల్లా, మేళ్ల దుప్పలపల్లి అనే పల్లెటూరుకు చెందినవాడు. 7వ తరగతిలోనే డ్రాపౌట్ అయి ఎడ్లగాసి, నాగలి దున్ని తన బాల్యాన్ని వ్యవసాయానికి ఎరువుగా మార్చా డు. బహుశా ప్రజానాట్య మండలిలో పని చేసినందుకేనే మో 'నా చిట్టీ చేతులు' పాట చింతల యాదగిరి రాశాడని ఎక్కువగా తెలియదు. ఆయన తెలియకున్నా ఈ సమా జం ఆయన పాటలను విన్నది, పాడుకున్నది. ఆయన రాసి పాడిన మచ్చుకు కొన్ని పాటలను పరిశీలిద్దాం. 'గుండెలోన రగిలిన బాధ కన్నీరై కారుతుంది/ కష్టానికి కారకులెవరో తెలుపమని కోరుతుంది' అంటూ యాదగిరి కంటికి కనిపించని బాధకు రూపంగా, కన్నీటిని వస్తుగతంగా మనకు చూపెడుతున్నాడు. అందుకే యూట్యూబ్‌లో ఉన్న ఈ పాటకు పది మిలియన్లకు పైగా వ్యూస్ కనిపిస్తున్నాయి. మొదటి లైన్లలోనే పదునైన పద ప్రయోగం, పాట మొత్తం భావాన్ని ఒక్క పల్లవిలో కూర్చి శ్రోతలను తనవైపునకు తిప్పుకోవడంలో యాదగిరి దిట్ట. 'ఉన్న ఊరు కన్న తల్లిని వదిలి పోలేనే/ నేల తల్లి పొదుగును కాదని చెదిరీ పోలేనే' అని సరళంగా, సూటి గా, ఒక బలమైన స్టేట్‌మెంట్‌తో పాటను ప్రారంభించిన యాదగిరి మనల్ని ఆ పాటలోకి ఆకర్షిస్తాడు. మనకు తెలియకుండానే మనల్ని సమరానికి సన్నద్ధం చేస్తాడు. అంతెందుకు 'అన్నదాత ఆగమవుతుండే/ పురుగుమందుతో ప్రాణాలొదిలిండే/ మట్టిబిడ్డడు మాయమవుతుండే/ మనలనిడిసీ వెళ్లిపోతుండే/ కనికరించని కాలం తోడు/ కాటువేసిన పాలన చూడు' అని యాదగిరి విలపిస్తూ రైతు ఆత్మహత్యలపై పాడిన పాట విన్నవారెవ్వరైనా సరే ఏడవకుండా ఉండలేరు. నిజానికి చాలామంది కవులు కరువుకు కాలాన్ని, ప్రకృతిని కారణంగా చూపిస్తారు. కానీ యాదగిరి మాత్రం రైతులను ప్రభుత్వం కాటు వేసిందని, లేదంటే లోకానికి అన్నం పెట్టే రైతు ఆత్మహత్య చేసుకోడని చెప్తాడు. అంటే సమస్య పట్ల లోతైన అవగాహన ఒక ప్రజా, ఉద్యమ కవికి మాత్రమే ఉంటుందనే విషయం గమనార్హం. ఇలా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన మార్క్సిస్టు దృక్పథాన్ని యాదగిరికి అందించింది ప్రజానాట్యమండలియే. 'అమ్మ రొమ్ము పాలలోన



ఫ్లోరీను జాడ/ అన్నమిచ్చె పంట మీద విషపు నీళ్ల నీడ/ పాకులాడే ప్రాయమందు పట్టుకుంది వెన్ను/ కీలు కీలు అరగదీసి సంపుతుంది నన్ను' అంటూ నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య మీద పాట రాసిన మొట్టమొదటి వాగ్గేయకారుడు చింతల యాదగిరి. దీని విష ప్రభావం నల్లగొండ జిల్లా నీళ్లలో ఎంత దారుణంగా ఉన్నదో పై చరణంలో మనకు తెలుస్తుంది. ఇలా చింతల యాదగిరి వందల పాటలు రాశాడు. ఆయన రాసిన కొన్ని పాటలతో 'తీగో నాగో ఎన్నియ్యలో' అనే పుస్తకాన్ని మట్టిముద్రణలు, అలగడప వారు ముద్రించారు. మూడు దశాబ్దాలుగా పాటల వ్యవసాయం చేస్తున్న చింతల యాదగిరికి నడుస్తున్న తెలంగాణ వాగ్గేయ చరితలో ప్రామాణికమైన పాటకవిగా, ప్రజాకవిగా, వాగ్గేయకారుడిగా కావాల్సిన ప్రచారం, గుర్తింపు దక్కలేదు. తెలంగాణ నేల గర్వించదగిన గొప్ప కవిగాయకుడు చింతల యాదగిరి. నిజానికి చింతల యాదగిరి పాటంటే ఆనందం కాదు, ఆవేదనల మూట. తన్మయత్వం కాదు, తనువు అణువణువులో చెలరేగే ఆవేశం. తన స్వరం నిప్పురవ్వలను వెదజల్లే ఎర్రని కొలిమి. ఆ మండే గొంతులోంచి తన్నుకొచ్చే జీర సముద్రపు అలల హోరును, తుఫాను గాలి జోరును గుర్తుచేస్తూ పాడుతుంది. ఆయన కలంతో పొడిచే పొద్దుపై సంతకం చేస్తూ.. కాలం నుదుటన మరిన్ని పదునైన పాటలు రాయాలని ఆశిద్దాం. (వాగ్గేయకారుడు చింతల యాదగిరి 2024, డిసెంబర్ 15న ఢిల్లీ వేదికగా బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంగా..)

# ఉదయం లేవగానే మడమలు నొప్పిగా ఉంటున్నాయా అయితే ఇలా చేయండి

చాలా మందికి ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలి మడమలు లేదా పాదాలు నొప్పిగా ఉంటాయి. కొందరికి ఈ నొప్పులు చలికాలంలో ఇంకా ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ నొప్పులు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ పలు సూచనలు పాటిస్తే ఈ నొప్పులను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. ఇందుకు గాను ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. పలు సహజసిద్ధమైన పద్ధతుల్లోనే కాలి మడమలు లేదా పాదాల నొప్పులను తగ్గించుకోవచ్చు. అందుకు పాటించాల్సిన సూచనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. పాదాలు లేదా మడమల నొప్పి వచ్చేందుకు ఒక ప్రధాన కారణం ఉంటుంది. అదేమిటంటే.. కాలి వేళ్లను, మడమలను కలిపే కణజాలం ఒత్తిడికి గురైనా లేదా ఎక్కువగా సాగినా కూడా ఈ నొప్పి అనేది వస్తుంది.

**అనేక కారణాలు..**

పాదాలపై పదే పదే ఒత్తిడిని కలగజేస్తే ఈ విధంగా కణజాలం సాగే అవకాశాలు ఉంటాయి. అలాగే ఎక్కువ సేపు నిలబడడం, మరీ ఎక్కువగా వాకింగ్ లేదా రన్నింగ్, జాగింగ్ వంటివి చేయడం, సరైన షూస్ లేదా చెప్పులను ధరించకపోవడం వల్ల పాదాలపై, మడమలపై ఒత్తిడి పడుతుంది. దీంతో అక్కడ ఉండే కణజాలం వాపులకు గురవుతుంది. సాగుతుంది. దీని వల్ల పాదాలు లేదా మడమల్లో నొప్పులు వస్తాయి. అలాగే హై హీల్స్ ఉన్న చెప్పులను ధరించడం, అధిక బరువు ఉండడం వల్ల కూడా ఈ నొప్పులు వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి.

**విశ్రాంతి అవసరం..**


అయితే ఈ నొప్పులు ఉన్నవారు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలు లేదా మడమల నొప్పులు పూర్తిగా తగ్గే వరకు విశ్రాంతి అవసరం. లేదంటే సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. దీంతో నొప్పులు మరీ ఎక్కువవుతాయి. అప్పుడు మరీ ఇబ్బందిగా ఉంటుంది. నడవడం కూడా కష్టంగా ఉంటుంది. కనుక ఈ తరహా నొప్పులు ఉన్నవారు కచ్చితంగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలకు విశ్రాంతిని ఇవ్వాలి. తేలికపాటి నడక అయినా సరే వద్దు. అలా చేయడం కూడా మంచిది కాదు. పూర్తిగా విశ్రాంతిని ఇవ్వాలి. దీంతో త్వరగా నొప్పుల నుంచి కోలుకునే అవకాశం ఉంటుంది.

**ఆవనూనెతో మసాజ్..**

మార్కెట్‌లో పాదాలను సున్నితంగా ఉంచే పాదరక్షలు లేదా షూస్ లభిస్తున్నాయి. వాటిని ధరించాలి. దీంతో పాదాలపై భారం పడకుండా ఆపవచ్చు. దీని వల్ల కూడా నొప్పులు తగ్గుతాయి. అలాగే కాస్త ఆవనూనెను వేడి చేసి రాత్రి పూట పాదాలకు మర్దనా చేయాలి. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది. మరుసటి రోజు ఉదయం వరకు నొప్పులు తగ్గిపోతాయి. ఇలా పూర్తిగా కోలుకునే వరకు చేయాలి. నొప్పులను తగ్గించడంలో ఆవనూనె ఎంతగానో పనిచేస్తుంది. పాదాలు సాగేలా చేసే వ్యాయామాలు లేదా యోగా చేయాలి. దీని వల్ల కూడా ఫలితం ఉంటుంది. ఈ తరహా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా పలు సూచనలను పాటించడం వల్ల పాదాలు లేదా మడమల నొప్పులను సులభంగా తగ్గించుకోవచ్చు.



# వైరస్‌లు క్యాన్సర్ కారకాలు



శరీరంలో ఏదైనా భాగంలో కణాల పెరుగుదల అదుపులేకుండా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్‌గా పేర్కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ప్రజల అనారోగ్యానికి, మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణంగా ఉంటున్నది. ఇప్పుడు ఇతర కారకాలతోపాటు వైరస్‌లు కూడా కొన్ని రకాల క్యాన్సర్లను కలగజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు ఆరోగ్య రంగ నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైరస్‌లు క్యాన్సర్‌ను ఎలా కలగజేస్తాయి, వాటిని నిరోధించడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో అవగాహన ఉండాలి. ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అతి సూక్ష్మ అంటురోగాల కారకాలే వైరస్‌లు. ఇవి బయటి వాతావరణంలో నిర్జీవులుగా ఉంటాయి. ఒకసారి జీవిలో ప్రవేశించాయంటే ఆ జీవి కణాల్లో అభివృద్ధి చెందుతూ జీవ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అయితే, కొన్ని రకాల వైరస్‌లు అవి ఆశ్రయించిన (హోస్ట్) జీవి కణాల పనితీరులో కలిసిపోయేలా మార్పుచెందుతాయి. దీనివల్ల కణాల సాధారణ విధుల్లో అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి వాటిలో 'ఆంకోజెనిక్' లేదా 'ట్యూమర్ వైరస్‌లు'గా పిలిచే అనేక వైరస్‌లు మనుషుల శరీరంలో క్యాన్సర్ అభివృద్ధికి కారణంగా ఉంటాయి. వీటిలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు (హెచ్‌బీవీ, హెచ్‌సీవీ), లాలాజలం, ఇతర శరీర ఫ్లూయిడ్ల ద్వారా వ్యాపించే 'ఎప్‌స్టీన్ బార్ వైరస్' (ఈబీవీ), హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) లాంటివి ప్రసిద్ధి చెందిన క్యాన్సర్ కారక (ఆంకోజెనిక్) వైరస్‌లుగా ఉన్నాయి. ఈ వైరస్‌లు క్యాన్సర్‌కు దారితీసే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కాకపోతే అవి వ్యాపించే విధానం మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఆంకోప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది కణం పనితీరు సాఫీగా సాగిపోయే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నియంత్రణ లేకుండా కణాలు పెరిగిపోయే క్రమాన్ని ప్రోత్సహిస్తుంది. చివరికి ప్రాణాంతకమైన క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి, సి వైరస్‌లు కూడా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. హెపటో సెల్యులర్ కార్సినోమా అనే క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులలో, హెచ్‌ఐవీ సోకిన వారిలో వైరస్ సంబంధిత క్యాన్సర్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**రోగాల భారం...**

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్యాన్సర్ ముప్పు వైరల్ ఇన్ఫెక్షన్లతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అంచనాల ప్రకారం సంవత్సరానికి ఇరవై లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు క్యాన్సర్ కారక వైరస్‌లతో (ఆంకోజెనిక్ వైరస్‌లు) సంబంధం కలిగి ఉన్నాయి. దాదాపు 90 శాతం గర్భాశయ క్యాన్సర్లకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), కాలేయ క్యాన్సర్లలో ఎక్కువ భాగం హెపటైటిస్ బి (హెచ్‌బీవీ), హెపటైటిస్ సి (హెచ్‌సీవీ)లు కారణం అవుతున్నాయి. అయితే, వైరస్ ఇన్ఫెక్షన్లు, వాటి కారణంగా క్యాన్సర్లు రాకుండా నివారించడంలో ప్రభుత్వాలు చేపట్టే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలే కీలకపాత్ర పోషిస్తాయి.

**నివారణకు బహుళ నమూనా...**

వైరస్‌ల వల్ల అభివృద్ధి చెందే క్యాన్సర్లను నిరోధించడానికి ఆయా రకాల వైరస్‌ల వ్యాప్తిని తగ్గించడం, టీకాలు వేయడం, ముందుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం, ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్స అందించడం వంటి బహుళ నమూనా (మల్టీ మోడల్) విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

**టీకాలు (వ్యాక్సినేషన్)...**

క్యాన్సర్ నివారణలో టీకాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని రుజువైంది. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌పై పోరాటానికి హెచ్‌పీవీ టీకా సమర్థంగా పనిచేస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి వైరస్‌తో వ్యాపించే కాలేయ క్యాన్సర్ ప్రాబల్యాన్ని తగ్గించడంలో హెపటైటిస్ బి టీకాలు ప్రభావవంతమైన పరిష్కారంగా చెప్పొచ్చు. ప్రజారోగ్య ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా చిన్న వయసులోనే అవసరమైన టీకాలు వేయించుకోవడం, అధిక టీకా రేట్లు నమోదు కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలి.

**స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు...**

గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు పాప్ స్మియర్ టెస్ట్, హెచ్‌పీవీ పరీక్షలు చేయించుకోవడం వంటివి వైరస్‌లతో వచ్చే క్యాన్సర్లను ముందుగా గుర్తించేందుకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా ముప్పు ఎక్కువగా ఉన్న వారి విషయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. చికిత్సను సులభతరం చేస్తాయి.

**యాంటీవైరల్ థెరపీ...**

హెపటైటిస్ బి వైరస్, హెపటైటిస్ సి వైరస్ వంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీవైరల్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటితో వైరస్ స్థాయిలను సమర్థంగా తగ్గించుకోవచ్చు. ఆ విధంగా క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును కూడా తగ్గించవచ్చు. హెపటైటిస్ సి చికిత్సలో ప్రత్యక్షంగా పనిచేసే డైరెక్ట్ యాక్టింగ్ యాంటీవైరల్ ఏజెంట్ల పురోగతి పూర్తి వైరస్ నిర్మూలనకు, క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఇస్తుంది.

**ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు...**


వైరస్‌లు, కాన్సర్ల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయి. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, టీకాల ప్రాముఖ్యం, వ్యాధుల బారినపడటాన్ని తగ్గించడానికి సురక్షిత చర్యలు తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకత పెంపు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయి. కాబట్టి ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్‌ఐవీ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ఉన్న సమూహాలు ఎదుర్కొనే ముప్పును తగ్గించడానికి తగిన టీకా కార్యక్రమాలు, స్క్రీనింగ్ చర్యలు దోహదపడతాయి. వైరస్‌లు సాధారణ జలుబు మొదలుకుని క్యాన్సర్ల వ్యాప్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారకాలుగా ఉంటాయి. ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి వివిధ రంగాల నుంచి సమష్టి కృషి అవసరమవుతుంది. వైరస్ ప్రేరిత, వైరస్ సంబంధిత క్యాన్సర్లను నివారించడంలో టీకాలు, స్క్రీనింగ్, యాంటీవైరల్ థెరపీలు కీలకమైన అంశాలు. ఈ రక్షణ చర్యలపై ప్రభుత్వాలు, ఆరోగ్య రంగ సంస్థలు దృష్టి సారించడం ద్వారా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపర్చుకోవచ్చు. అయితే, వైరస్‌లు, క్యాన్సర్ల మధ్య పరస్పర చర్యలపై అంతర్జాతీయంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాబట్టి, క్యాన్సర్లను నివారించే దిశగా ఔషధాలు, చికిత్సలు అభివృద్ధి చేసే దిశగా నిరంతర అధ్యయనం, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

# గుండెల్ని పిండే కాలుష్యం



భారతీయ నగరాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వస్తున్నది. వాయుకాలుష్యం ఇతరులకంటే గుండె జబ్బులున్నవారికి మరింత ప్రాణాంతకమని అమెరికా పరిశోధకులు గుర్తించారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలతో కలిసి ఇంటర్‌మౌంటెన్ హెల్త్ సంస్థకు చెందిన పరిశోధకులు వాయు కాలుష్యం వల్ల ఆరోగ్య దుష్ప్రభావాలపై అధ్యయనం నిర్వహించారు. క్యూబిక్ మీటర్ గాలిలో 7 నుంచి 20 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు ఉన్న ఢిల్లీ మరికొన్ని నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. గాలి కాలుష్యం 2.5 పీఎం స్థాయిలో ఉన్న ప్రాంతాల్లోని సాధారణ ప్రజలు, గుండె జబ్బుతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి అధ్యయనం చేశారు. వాయు కాలుష్యం వల్ల గుండె జబ్బు బాధితుల రక్త నమూనాల్లో అనేక అనారోగ్యకారకమైన మార్పులు గుర్తించారు. గుండె జబ్బులు ఉన్నవాళ్ల రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయోమేకర్స్ (%జజూ27, ×ూ%-18) చాలా ఎక్కువగా ఉన్నాయని తేలింది. గుండె జబ్బులు లేనివాళ్లలో ఏ మార్పూ కనిపించలేదు. హృద్రోగులు వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం చెబుతున్నది. ఎంత జాగ్రత్తగా ఉంటే గుండెకు అంత మంచిది.

# కాళన్న స్ఫూర్తి ఎక్కడ?



'పాలనాధికారం దుర్వినియోగం చేసే/ గుండాలకు నేను ద్రోహినే/ అన్యాయాన్నెదిరించడం/ నా జన్మహక్కు నా విధి' అన్న కాళోజీని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వాన్ని చాటే నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలకూ, ప్రాజెక్టులకు ఇంకా మరెన్నింటికో తెలంగాణ కీర్తి పతాకలు, స్ఫూర్తి ప్రతీకలుగా నిలిచిన మహానుభావుల పేర్లు పెట్టారు. కుమ్రంభీం, జయశంకర్‌సార్, కాళోజీ వంటి తెలంగాణ పోరాట పటిమకు, తెగువకు మారుపేరైన మహోన్నతుల పేర్లను నిత్య స్మరణీయాలుగా మార్చి నిజమైన నివాళి ఘటించారు. ఆ కోవలో రూపుదిద్దుకున్నదే వరంగల్‌లోని కాళో జీ కళాక్షేత్రం. ఏకశిలా నగరానికి సిగలో పువ్వులా సువిశాలమైన ప్రాంగణంలో మహా సభావేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రణాళికలు వేశారు. ఆ ప్రాంగణంలోనే కాళన్న నిలువెత్తు విగ్రహం చేయించారు. ప్రారంభోత్సవమే తరువాయి అన్న తరుణంలో సర్కారు మారింది. దాదాపుగా పూర్తయిన భవనానికి రంగులు, సున్నాలు వేసి అట్టహాసాలు చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే ఇదివరక టి సర్కార్ పూర్తిచేసిన రిక్రూట్‌మెంట్‌తో నియామక పత్రాల పంపిణీ పేరిట హంగామా చేసి పేరు కొట్టేయాలని చూసినవాళ్ల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం? ఇంతకూ కాళోజీ పేరుతో ప్రచారం పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పాలకుల్లో ఆయన స్ఫూర్తి కించిత్తు అయినా ఉన్నదా అనేది అసలు ప్రశ్న. ఏడాది కావస్తున్నా ఒక్కటంటే ఒక్కటి ప్రజానుకూల నిర్ణయం తీసుకున్నారా? ఒక్క మంచిపనికి శ్రీకారం చుట్టారా? అంతదాకా ఎందుకు, ఏ అస్తిత్వం కోసం కాళోజీ లాంటి మహానుభావులు కొట్లాడారో దానినైనా కాపాడుతున్నారా? తెలంగా ణ పొడే గిట్టని పరాయి పాలకుల ముందు మోకరిల్లుతున్నారు. నీటి హక్కులను కాటగలుపుతున్నారు. ఇదంతా చాలదన్నట్టుగా ఆనవాళ్లు చెరిపేస్తామని ఎగిరెగిరి పడుతున్నారు. కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ ఆనవాళ్లలో ఒకటి కాదా? ఆ మాటకు వస్తే తెలంగాణే కేసీఆర్ అతిపెద్ద ఆనవాలుగా చరిత్రలో నిలిచిపోయింది. చెరిపేస్తే చెరిగిపోవడానికి అది నీటిమీది రాతకాదు, సువర్ణాక్షరం. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయే చేతగాని, అనుభవం లేని పాలకు లు రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నరు. ప్రజాపాలన అంటూ ప్రజాకంట క పాలన తెచ్చారు. ప్రశ్నిస్తే కేసులు అరెస్టులంటూ వేధిస్తూ పోలీసు రాజ్యం చెలాయిస్తున్నారు. కాళోజీ బ్రతికి ఉంటే ఇవన్నీ సహించేవా రా? 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర పెడతం' అని గర్జించాడు కదా. అంతేకాదు, తన పేరిట నిర్మించిన ప్రాంగణంలోనే పోలీ సు జులుం ప్రదర్శిస్తే ఊరుకునేవారా? 'హింస పాపమని యెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?' అని ప్రశ్నించిన కాళోజీ నేడు రాష్ట్రాన్నే జైలుగా మార్చి ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తే పోనీలే అని సరిపెట్టుకునేవారా? 'మరిచిపోకుండగ గురుతుంచుకోవాలె.. కాలంబు రాగానె కాటేసి తీరాలె' అని కాళన్న చెప్పింది ఈ తరహా పాలకుల గురించే అన్నది గుర్తుంచుకోవాలి.

# నిజం చెప్పకుంటే అబద్ధమే రాజ్యమేలుతుంది



పోరాటాల గడ్డ మన వరంగల్ ఖిల్లా. తెలంగాణ ఉద్యమ నాదాన్ని శిరస్సుపై మోసి భారతదేశానికి ప్రత్యేక రాష్ట్ర వాంఛను పరిచయం చేసింది మన వరంగల్ జిల్లానే. కాకతీయ రాజులు, సమ్మక్క-సారక్కలు అందించిన వారసత్వంతో%ొూ% దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పౌరుషత్వంతో పిడికిలి బిగించి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన వరంగల్ జిల్లా ప్రజానీకానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నిన్న వరంగల్ జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు గాను వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యలకు మనందరం సమాధానం చెప్పకపోతే అన్యాయమే రాజ్యమేలుతుంది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నేలా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్‌ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ధిక్కార స్వర నినాదంతోటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పడం లో ఎలాంటి సందేహం లేదు. ప్రజల ఐక్యతతో అందిపుచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత ప్రజ్వరిల్లాలని మన వరంగల్ ప్రత్యేక భూమిక పోషించింది. అందులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలతో త్రినగరాన్ని సుందరీకరించుకున్నాం. ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలను వరంగల్ జిల్లాకు తీసుకువచ్చి, వరంగల్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసిన నేత కేసీఆర్. కానీ, కొందరు మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలను, అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, చరిత్ర చెరిగిపోదు కదా? కాకతీయ రాజుల చరిత్రను తిరగరాసేలా.. ముందు తరాలకు భవిష్యత్తు రహదారిని పరిచేందుకు గాను కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి రేగుముల్లతో ఉన్న పొలాలను పచ్చని మాగాణిగా మలిచారు. నాడు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు ను అణచివేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని శతవిధాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ నేడు నీతులు మాట్లాడుతుండటం నీచమైన రాజకీయ చర్యగా భావిస్తున్నా. కాళోజీ నామస్మరణ చేసే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదు. నాడు వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భజనలు చేయడం చూస్తుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కాళో జీ నారాయణరావుకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ నేతృత్వంలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగ ల్ జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానం చేశారు. అనుకున్నదే తడవుగా ప్రత్యేక జీవో ద్వారా నిధులను విడుదల చేసి నిర్మాణ పనుల ను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి కారణంగా నిర్మాణ పనులు కొం చెం ఆలస్యమయ్యాయి. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పుడు చంకలు గుద్దుతూ మేమేదో చేశామన్నట్టు ఊకదంపుడు రాతలతో నిజాలను అబద్ధాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోతుందా? నిజానిజాలేమిటో ప్రజలకూ తెలుసు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకున్నట్టయితే వెలుగులు విరజిమ్మేలా.. కండ్లు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధే తప్ప.. రాష్ట్రంలో గత ఏడాది కాలం గా జరిగిన అభివృద్ధి శూన్యం అనేది నూటికి నూరుపాళ్లు నిజం. నాటి ప్రభుత్వ ప్రగతి చక్రాలతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, పర్యాటకం, సాంస్కృతిక, ఉపాధి అన్నిరంగా ల్లో కేసీఆర్ తనదైన ప్రత్యేక చొరవను చూపించారు. ఒక్క వరంగల్ జిల్లానే కాదు, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో దూసుకుపోయిం ది. కానీ, నేడు రాష్ట్రంలో చీకట్లు అలుముకున్నాయి. దశాబ్ద కాలపు అభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క పచ్చగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా తీరు మారింది. ఇది నేనొక్కదాన్నే చెప్తున్న వాస్తవం కాదు, రాష్ట్ర పరిస్థితిని చూసిన ప్రజలందరూ ముక్తకంఠంతో ఘోషిస్తున్నది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ జిల్లాకు ప్రాణం పోసిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం. హైదరాబాద్ అభివృద్ధికి ఏ మాత్రం తీసిపోకుండా వరంగల్‌కు అంతే ప్రాధాన్యం కల్పించింది తెలంగాణ తొలి ప్రభుత్వం. అభివృద్ధికి చిరునామాగా మారుస్తూ జాతీయ కంపెనీ మెగా టెక్స్‌టైల్ పార్కును సైతం తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిది. అభివృద్ధి పథాన దూసుకువెళ్తున్న తెలంగాణను అణగదొక్కాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ఆంధ్రా తొత్తులతో కలిసి కుట్రలు చేసిన విషయం తెలంగాణలోని ప్రతీ పౌరునికి తెలుసు. ఆ కుట్రలను ఛేదించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక ఖ్యాతిని గడించి యావత్ ప్రపంచాన్ని మనవైపు తిప్పుకునేలా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది. నిరంత రం అభివృద్ధి మంత్రంతో, సంక్షేమ పథకాల తో, ప్రజారంజకమైన పరిపాలనను అంది స్తూ.. సబ్బండ వర్గాలను గుండెకు హత్తుకున్న చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది. ఈ ప్రాంత బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలతో దేశానికి వన్నె తెస్తే, ఢిల్లీలో తన చితికి కట్టెపుల్ల కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పీవీ గురించి మాట్లాడటం మరీ విడ్డూరం. జాతీయ రహదారులకు, తెలంగాణ రాష్ట్ర అంతర్గత రోడ్లను అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నే లా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్‌ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్‌ఎస్ ప్రభు త్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకొని అధిష్ఠానానికి చేరవేయడమే తప్ప అంతకుమించిందేమీ ఉండదు. తెలంగాణ రాష్ట్రం నలువైపులా మరింత అభివృద్ధి సాధించాలంటే అదొక్క బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలుసుకో. మణిపూర్ లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చూస్తున్నాం. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఢిల్లీకి డబ్బు ల మూటలు అప్పజెప్పడంతోనే ఆ పార్టీకి సరిపోతున్నది. అధికార జులుంతో, పోలీసు బలగాలతో గిరిజన తండాలపై దాడులు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గిరిజనులు తమ భూములను అప్పనంగా అప్పజెప్పాలని రైతులకు సంకెళ్లతో బేడీ లు వేసి, అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రాక్షస ప్రభుత్వం ఇది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ పోలీసు బలగాలతో చేస్తు న్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోవడం ఖాయం.

# ఏకీకరణతో లక్ష్యం నెరవేరేనా?




దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను 28కి కుదించేందుకు గాను కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 4న గ్రామీణ బ్యాంక్ చైర్మన్లకు, వాటి స్పాన్సర్ బ్యాంక్‌ల ఎండీలకు ఈ విషయాన్ని లేఖ ద్వారా తెలియజేసింది. ఒక రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ అనేది ఈ విలీనానికి ప్రధాన ప్రాతిపదిక. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ప్రక్రియ పూర్తికావచ్చు. ఇదే జరిగితే తెలంగాణ రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ఏర్పడుతుంది. దాని పేరు 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' అని ఉంటుంది. దేశవ్యాప్తంగా రాష్ట్రం పేరుతో గ్రామీణ బ్యాంక్‌ల పేర్లు మారిపోయాయి. ప్రస్తుతం తెలంగాణలో రెండు గ్రామీణ బ్యాంక్‌లు పనిచేస్తున్నాయి. 18 జిల్లాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మిగతా 15 జిల్లాలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలందిస్తున్నాయి. ఈ రెండింటికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్నది. వాణిజ్య బ్యాంకుల జాతీయాకరణ తర్వా త కూడా అవి గ్రామాల్లో తమ శాఖల ను తెరవడానికి ముందుకురాలేదు. స్థాయికి తగ్గ వ్యాపారం లభించక ఇప్పటికే తమ గ్రామీణ శాఖలు నష్టాల్లో ఉన్నాయని కేంద్రానికి అవి మొర పెట్టుకున్నాయి. చివరికి ఆనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఆర్బీఐ మాజీ గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ సూచనల ప్రకారం తక్కువ ఖర్చుతో 'వాణిజ్య బ్యాంకు విధానాలు, గ్రామీణ ప్రజల అవసరాలు' కలిసే రీతిలో గ్రామీణ బ్యాంక్‌ల రూపకల్పన జరిగింది. గ్రామీణ బ్యాంక్ మూలధనంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 35 శాతం స్పాన్సర్ బ్యాంక్, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాలుంటాయి. అలా బాధ్యతలు, లాభనష్టాలు మోసేందుకు మూడింటి భాగస్వామ్యం అవసరమైంది. 1975లో ప్రథమ గ్రామీణ బ్యాంక్ యూపీలోని మొరాదాబాద్‌లో ఏర్పడింది. 1976లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టం వచ్చింది. అలా పదేండ్ల కాలంలో దేశవ్యాప్తంగా 196 గ్రామీణ బ్యాంక్‌లు విస్తరించాయి. బ్యాంక్‌ల వ్యాపార లక్ష్యం ఆర్థిక లాభం కాగా, గ్రామీణ బ్యాంక్‌ల లక్ష్యం మాత్రం సామాజిక లాభంగా ప్రభుత్వం గుర్తించిం ది. వాటి నష్టాలను నష్టాలుగా భావించలేదు. రైతులకు, గ్రామీణులకు అవి అందిస్తున్న ఆర్థిక సేవలనే లాభాలుగా పరిగణించింది. అయితే, 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణల రాకతో ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర దృక్కోణం మారిపోయింది. నష్టా ల్లో ఉన్నవి కూడా లాభాల బాట పట్టక తప్పదు. అప్పటికే గ్రామీణ భారతంలో ప్రధాన పరపతి సంస్థగా వేళ్లూనుకున్న గ్రామీణ బ్యాంక్‌ల నిర్వహణ ఖర్చులను తగ్గించాలనుకున్నది. అలా 2004-05లో మొదలైన వీటి సంఖ్య తగ్గింపు ప్రక్రియ దశలవారీగా సాగి 2020-21 నాటికి 196 నుంచి 43కు చేరింది. ఒక రాష్ట్రంలో ఒక స్పాన్సర్ బ్యాంక్‌కు ఒకే గ్రామీణ బ్యాంకు ఉండాలనే నిబంధనతో ఉమ్మడి ఏపీలో ఉన్న 16 గ్రామీణ బ్యాంకులు 6గా మారాయి. తెలంగాణ విషయానికి వస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అధీనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన శాతవాహన గ్రామీణ బ్యాంక్, నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ గ్రామీణ బ్యాంక్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని శ్రీ సరస్వతి గ్రామీణ బ్యాంక్, రంగారెడ్డి జిల్లా గోల్కొండ గ్రామీణ బ్యాంక్ ఉండేవి. విలీన ప్రక్రియలో భాగంగా మార్చి 2006లో ఈ 4 గ్రామీ ణ బ్యాంక్‌లు కలిసి దక్కన్ గ్రామీణ బ్యాంకు ఏర్పడింది. ఆ తర్వాత హైదరాబాద్ జిల్లాను కూడా ఇం దులో కలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014, అక్టోబర్‌లో బ్యాంక్ పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్చారు. తెలంగాణలోని మిగతా ఐదు జిల్లాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు గ్రామీణ బ్యాంక్‌లున్నాయి. వాటితోపాటు ఏపీలోని శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకు కలిసి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా ఏర్పడింది. 2016లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ విలీనం కావడంతో తెలంగాణలోని రెండు గ్రామీణ బ్యాంక్‌ల స్పాన్సర్ బ్యాంక్ ఒక్కటైంది. స్పాన్సర్ బ్యాంక్ పరంగా గ్రామీ ణ బ్యాంక్‌లు కలిపివేస్తున్నందున టీజీబీ, ఏపీజీవీబీలు రెండు కలిసిపోవాలి. కొత్తగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ప్రతిపాదన తెచ్చినందున తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, ఖమ్మం, ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఏపీజీవీబీ శాఖలను టీజీబీలో కలపాలి. అలా కొత్తగా 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' పురుడు పోసుకుంటుంది. ఈ ఏడాది మొదట్లోనే రాష్ట్రానికి ఒక గ్రామీణ బ్యాంక్ అనే ప్రతిపాదనను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెరపైకి తెచ్చినా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీజీవీబీ ఉండటంతో చర్చ ముందుకు సాగలేదు. ఏపీజీవీబీ శాఖలు రెండు రాష్ట్రాల్లో ఉన్నందున ఆ వాటా లెక్కలను రెండు రాష్ట్రాలు కలిసి తేల్చుకోవాలి. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రాష్ట్రానికి చెందిన 15 శాతం వాటా పరిస్థితి తెలుసుకొని ఉండాలి. కానీ, అలా జరగలేదు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ కాబట్టి హన్మకొండలో ఉన్న ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయం తరలిపోతున్నది. పైగా ఏపీలోని గ్రామీణ బ్యాంక్‌లకు కెనరా బ్యాంక్ స్పాన్సర్ కానున్నది. ఏపీజీవీబీ వాటాను తెలంగాణలో ఎస్‌బీఐ, ఆంధ్రలో కెనరా బ్యాంకు పంపకాలు చేసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉన్నది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 25 - 02 - 2025

## బంగారం మెరుపులు వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా రూ.90వేల పై మాటే



పెండ్లిండ్ల సీజన్ ప్రారంభం కావడంతో రిటైలర్లు, జ్యువెల్లర్ల నుంచి గిరాకీ పెరగడంతో కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు తిరిగి ధగధగ మెరుస్తున్నాయి. మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.600 వృద్ధితో రూ.78,050లకు చేరుకుంది. సోమవారం తులం బంగారం ధర రూ.77,450 వద్ద స్థిర పడింది. మరోవైపు కిలో వెండి ధర బుధవారం రూ.1,500 పుంజుకుని రూ.93,500 వద్ద ముగిసింది. సోమవారం కిలో వెండి ధర రూ.92 వేలు పలికింది. ఇక 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం రూ.600 పెరిగి రూ.77,650 వద్ద నిలిచింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ బంగారం తులం ధర రూ.615 వృద్ధితో రూ.75,662లకు చేరుకున్నది. అలాగే డిసెంబర్ డెలివరీ వెండి కాంట్రాక్ట్స్ ధర రూ.677 వృద్ధితో రూ.91,190 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 19.50 డాలర్లు పెరిగి 2,634.10 డాలర్ల వద్ద స్థిర పడింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడంతో ఇన్వెస్టర్ల పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. కామెక్స్ సిల్వర్ లో ఔన్స్ వెండి ధర 0.79 శాతం పెరిగి 31.47 డాలర్లకు చేరుకున్నది. పరిస్థితులు ఇలాగే కొనసాగడంతోపాటు యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గిస్తే 2025 డిసెంబర్ నెలాఖరు నాటికి ఔన్స్ బంగారం ధర 3000 డాలర్లకు దూసుకెళ్తుందని ప్రముఖ రేటింగ్ సంస్థ గోల్డ్ మాన్ సాచెస్ అంచనా వేసింది. వివిధ కేంద్రీయ బ్యాంకుల నుంచి డిమాండ్ రావడం కూడా బంగారం ధరల పెరుగుదలకు మరో కారణం అని పేర్కొంది.

## గోల్డ్ లోన్ చెల్లింపుల్లో ఇబ్బందులకు చెక్ త్వరలో కొత్త విధానం తేనున్న ఆర్‌బీఐ



అత్యవసర పరిస్థితుల్లో చాలామంది ఆర్థిక అవసరాల కోసం బంగారాన్ని తాకట్టుపెట్టి రుణాలు తీసుకుంటారు. ఈ రుణాలు సురక్షితంగా ఉంటాయి. ప్రస్తుతం బంగారం రుణాలను వడ్డీతో కలిపి అసలు కలిపి చెల్లించాల్సిందే. దాంతో చాలామంది వడ్డీతో కలిపి గడువులోగా తిరిగి చెల్లించడం ఇబ్బందికరంగా మారుతున్నది. దాంతో బంగారు ఆభరణాలు వేలానికి వెళ్లే పరిస్థితి నెలకొంది. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. బంగారం ఆభరణాలపై తీసుకునే రుణాలను ఈఎంఐ రూపంలో చెల్లించే సదుపాయాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. బంగారు రుణాల మంజూరులో అవకతవకల నేపథ్యంలోనే ఈఎంఐ విధానం అయితే బాగుంటుందని ఆర్‌బీఐ భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వాస్తవానికి, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని సెప్టెంబర్ 30న ఆర్బీఐ సర్క్యులర్‌లో పేర్కొంది. బంగారంపై రుణాలు అందించే సంస్థల పనితీరులో అవకతవకలు జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తించింది. రుణాల సోర్సింగ్, మదింపు కోసం ఉపయోగించే థర్డ్ పార్టీల్లో అనేక లోపాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఆభరణాల వేలంలోనూ పారదర్శకత లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల గోల్డ్ రుణాల్లో భారీగానే వృద్ధి ఉందని రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ అభిప్రాయపడింది. వ్యవస్థీకృత రుణదాతల పోర్ట్‌ఫోలియో మార్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకుల ఆభరణాల రుణాలు 51 శాతం పెరిగి రూ.1.4 లక్షల కోట్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొన్నాయి.

## గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు

### పరిచయం చేసే యోచనలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు
### రుణాల మంజూరులో లోపాల్ని గుర్తించిన ఆర్బీఐ




గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ) సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పులకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది. దీంతో బ్యాంకులు, గోల్డ్ లోన్ కంపెనీల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు బంగారంపై రుణాలకూ ఈఎంఐలను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఇదీ సంగతి..**

బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తీసుకునే రుణాల్లో లోపాలను గుర్తించామని ఈ సెప్టెంబర్ 30న ఓ సర్క్యులర్‌లో ఆర్బీఐ తెలిపింది. విలువ, పరిశీలన, రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, వేలం వంటి అంశాల్లో బ్యాంకులు, రుణదాతలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తారా? లేదా? అన్నది చూడాలని ఆర్బీఐ అంటున్నది. దీంతో ఈఎంఐ ఆధారిత వ్యవస్థను గోల్డ్ లోన్లకూ తేవాలనుకుంటున్నట్టు బ్యాంకర్లు చెప్తున్నారు. కాగా, సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు రూ.1.4 లక్షల కోట్ల గోల్డ్ లోన్లను ఇచ్చాయి. గతంతో పోల్చితే 51 శాతం పెరిగాయి.

## వరుస పతనాలకు బ్రేక్


### సెన్సెక్స్ 239, నిఫ్టీ 65 పాయింట్ల లాభం



దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. బ్యాంకింగ్, ఐటీ, వాహన షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా నాలుగు రోజులుగా నష్టపోయిన సూచీలు ప్రారంభం నుంచే లాభాల బాట పట్టాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 239.37 పాయింట్లు అందుకొని 77,578.38 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ ఏడు రోజుల పతనం నుంచి లాభాల్లోకి మళ్లింది. మార్కెట్ ముగిసే సమయానికి 64.70 పాయింట్లు అందుకొని 23,518.50 వద్ద స్థిరపడింది. గత ఏడు సెషన్లలో నిఫ్టీ 1,030 పాయింట్లు లేదా 4.3 శాతం పతనం కాగా, సెన్సెక్స్ 3,000 పాయింట్లు తగ్గి 77,300కి పడిపోయిన విషయం తెలిసిందే. ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపడం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, అమెరికా బాండ్ ఈల్డ్ బలపడటం సూచీల పతనానికి ప్రధాన కారణాలు. మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడగా..రిలయన్స్, ఎస్బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.

# హైదరాబాద్ ఆఫీస్‌కు గిరాకీ నై

### తగ్గిన కొత్త ఆఫీస్ స్పేస్ సైప్లై, లీజింగ్ 25 శాతం చొప్పున పతనం
### జూలై-సెప్టెంబర్‌కుగాను వెస్టియన్ నివేదిక



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు పదేండ్లపాటు అత్యధిక డిమాండ్‌ను చూసిన హైదరాబాద్ రియల్టీకి ఇప్పుడు ఆదరణే కరువైపోయింది.అటు హౌజింగ్ మార్కెట్, ఇటు ఆఫీస్ మార్కెట్ రెండూ కుప్పకూలుతున్నాయి మరి. ఎన్నో ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీలు విడుదల చేస్తున్న వరుస నివేదికలే ఇందుకు నిదర్శనం. దేశీయ రియల్టీపై అందులో హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ తీరుతెన్నులపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ రిపోర్టునిచ్చింది. ఇందులో ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్ సైప్లై, లీజింగ్ 25 శాతం పడిపోయినట్టు తేలింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులకు బ్రేక్ పడిందా?.. సుమారు దశాబ్దకాలం కనిపించిన డిమాండ్ ఇప్పుడు కనుమరుగైపోతున్నదా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కన్సల్టెన్సీ ఏదైనా.. చెప్పేది మాత్రం ఒక్కటే. అదే.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో నిస్తేజం ఆవరిస్తున్నదని. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా నివేదిక సైతం ఇదే చెప్తున్నది. మంగళవారం వచ్చిన ఈ రిపోర్టు.. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నట్టు తేల్చింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆఫీస్ స్పేస్ గతంతో చూస్తే 25 శాతం తగ్గినట్టు పేర్కొన్నది. 4.1 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైనట్టు స్పష్టం చేసింది. అలాగే ఇదే సమయంలో లీజింగ్ కార్యకలాపాలు సైతం 25 శాతం క్షీణించి 2.79 మిలియన్ చదరపు అడుగుల వద్దే ఉన్నట్టు వెల్లడైంది.

**రివర్స్ గేర్‌లో..**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందు గుర్తొచ్చేది హైదరాబాద్. ఒకప్పుడు బెంగళూరు, ముంబైలకు ఈ ఘనత దక్కినా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సుమారు పదేండ్లపాటు అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అందించిన సహకారంతో ఆ నగరాల స్థానంలోకి హైదరాబాద్ వచ్చి చేరింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, ఫార్మా, బయోసైన్స్, ఏవియేషన్, డాటా సెంటర్లు ఇలా అన్నింటికీ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. కానీ ఇప్పుడు ఆ ఉత్సాహం సన్నగిల్లింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆఫీస్ స్పేస్ సైప్లై కూడా అందుకు తగ్గట్టుగానే తగ్గుతూ వస్తున్నది. దీనిపై రియల్టీ వర్గాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.


**ఢిల్లీ, బెంగళూరుల్లో..**

ఓ వైపు హైదరాబాద్‌లో కొత్తగా వచ్చే ఆఫీస్ స్పేస్ క్షీణిస్తుంటే.. మరోవైపు బెంగళూరు, ఢిల్లీల్లో అది పెరుగుతూపోవడం గమనార్హం. ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో అందుబాటులోకి వచ్చిన నూతన ఆఫీస్ స్పేస్ 3.6 మిలియన్ చదరపు అడుగులు. గతంతో పోల్చితే 33 శాతం ఎక్కువ. అలాగే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ 2.3 మిలియన్ చదరపు అడుగులకు ఎగిసింది. మునుపటితో చూస్తే ఇది ఏకంగా 360 శాతం పెరగడం విశేషం. ముంబైలో 0.90 మిలియన్ చదరపు అడుగులతో యథాతథంగా కొత్త ఆఫీస్ స్పేస్ సరఫరా ఉన్నది. చెన్నైలో స్వల్పంగా తగ్గగా, కోల్‌కతాలో ఏ-గ్రేడ్ ఆఫీస్ స్పేస్ సైప్లనే లేదని వెస్టియన్ చెప్పింది. పుణెలో మాత్రం 26 శాతం తరుగుదల కనిపించింది. దీంతో హైదరాబాద్‌సహా దేశంలోని ఈ ఏడు ప్రధాన నగరాల్లో ఓవరాల్‌గా మార్కెట్‌లోకి కొత్త ఆఫీస్ స్పేస్ రాక 4 శాతం పడిపోయి జూలై-సెప్టెంబర్‌లో 12.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైనట్టు వెస్టియన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

**లీజింగ్‌లో..**

ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో లీజింగ్ కార్యకలాపాలు 84 శాతం ఎగిసి 6.63 మిలియన్ చదరపు అడుగులకు చేరుకున్నాయి. పుణెలో 112 శాతం పెరిగి 2.33 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. చెన్నైలో లీజింగ్ కార్యకలాపాలు యథాతథంగానే ఉండగా, ముంబైలో స్వల్ప క్షీణత కనిపించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 17 శాతం, కోల్‌కతాలో 45 శాతం తగ్గాయి. ఇక బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల్లో డిమాండ్ ఉన్నట్టు వెస్టియన్ చెప్తున్నది.

# నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు కానీ సాయంత్రం మాత్రం




దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం క్లోజ్‌లో ఉంటాయి. నేడు మహారాష్ట్ర ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో బంద్ ఉంటాయని ప్రకటించారు. కానీ సాయంత్రం మాత్రం కొన్ని రకాల ట్రేడింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆ విశేషాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. నేడు (నవంబర్ 20) బుధవారం స్టాక్ మార్కెట్‌లో ఉదయం సమయంలో ట్రేడింగ్ ఉండదు. ఈరోజున ఈక్విటీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ), సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ విభాగాల్లో ఎలాంటి ట్రేడింగ్ ఉండదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బీఎస్ఈలు ప్రకటించాయి. అయితే మహారాష్ట్రలో ఈరోజు అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కమోడిటీ మార్కెట్ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూసివేయబడుతుంది.

**సాయంత్రం మాత్రం...**

అయితే సాయంత్రం సెషన్‌లో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో ట్రేడింగ్ కొనసాగుతుంది. ఇది సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11:55 గంటల వరకు తెరిచే ఉంటుంది. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు రాత్రి 9 గంటల వరకు జరుగుతాయి. ఎన్నికల సంఘం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీలను అక్టోబర్ 15, 2024న ప్రకటించింది. ఈ క్రమంలో 288 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు జరుగుతుండగా, 4,136 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఓట్ల లెక్కింపు శనివారం నవంబర్ 23, 2024న జరుగుతుంది.

**ఈరోజు బ్యాంకులకు కూడా సెలవు...**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యాలెండర్ ప్రకారం నవంబర్ 20 న మహారాష్ట్ర అంతటా అన్ని బ్యాంకులు మూసివేయబడతాయి. అంతరాయం లేని ఆర్థిక లావాదేవీలను నిర్ధారించడానికి, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు ప్రకటించారు.

నిన్న మార్కెట్ ఎలా ఉంది?

భారత స్టాక్ మార్కెట్లో వరుసగా ఏడు రోజు క్షీణత మంగళవారంతో ముగిసింది. సెన్సెక్స్ 239.37 పాయింట్ల లాభంతో 77,578.38 వద్ద, నిఫ్టీ-50 64.70 పాయింట్ల లాభంతో 23,472.75 వద్ద ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు పెరగడం మార్కెట్‌ను బలపరిచింది. దేశీయ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కూడా ఇండెక్స్‌కు మద్దతునిచ్చాయి. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 1,100 పాయింట్లు పెరిగింది. అయితే నిఫ్టీలోని 50 కంపెనీలలో 27 కంపెనీల షేర్లు చివరి గంటలో అమ్మకాల కారణంగా లాభాలు పరిమితమయ్యాయి.

**చివరి సమయంలో...**

కానీ ట్రేడింగ్ చివరి గంటలో రష్యా, ఉక్రెయిన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా విదేశీ పెట్టుబడిదారులు భారీ అమ్మకాల కారణంగా మార్కెట్ లాభాలను కోల్పోయింది. మంగళవారం నాటి సెషన్‌లో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3411 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2783.89 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అక్టోబర్ 2024 తర్వాత విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు నవంబర్ నెలలో కొనసాగుతాయి. నవంబర్ మొదటి పక్షం రోజుల్లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.22420 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# రోజుకు రూ.7 డిపాజిట్‌తో నెలకు రూ.5000 పెన్షన్ మోడీ సర్కార్ అద్భుతమైన స్కీమ్




ప్రతి ఒక్కరూ తమ సంపాదన నుండి కొంత మొత్తాన్ని ఆదా చేయడానికి ప్రయత్నిస్తారు. వారి డబ్బు సురక్షితంగా ఉన్న ప్రదేశంలో పెట్టుబడి పెట్టాలని కోరుకుంటారు. అలాగే మంచి రాబడిని కూడా పొందుతారు. ఇది కాకుండా, కొంతమంది తమ వృద్ధాప్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి పెట్టడంతోపాటు పెట్టుబడి నుండి పదవీ విరమణ చేసిన తర్వాత ప్రతి నెలా ఒకేసారి మొత్తం లేదా పెన్షన్ పొందే పథకం కోసం చూస్తారు. ఈ సందర్భంలో, ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన చాలా ప్రజాదరణ పొందింది. దీని చందాదారుల సంఖ్య 7 కోట్లకు చేరింది. ప్రభుత్వ అటల్ పెన్షన్ యోజన పదవీ విరమణ తర్వాత ఎటువంటి ఆర్థిక సమస్యలు లేకుండా వృద్ధాప్యాన్ని సరదాగా గడపడానికి బాగా ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వం పెన్షన్‌కు హామీ ఇస్తుంది. మీరు ప్రతి నెలా చిన్న మొత్తాన్ని డిపాజిట్ చేయడం ద్వారా మీ వృద్ధాప్యాన్ని ఆర్థికంగా బలోపేతం చేయవచ్చు. ప్రతిరోజూ ఒక కప్పు టీ ధర కంటే తక్కువ పొదుపు చేయడం ద్వారా మీరు ప్రతి నెలా రూ. 5000 పెన్షన్ పొందవచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న అటల్ పెన్షన్ యోజన ద్వారా వృద్ధాప్యాన్ని హాయిగా గడపాలన్న కల నెరవేరుతుంది. ఇందులో రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు పెన్షన్ పొందవచ్చు. ఈ పథకంలో పెట్టుబడికి వయోపరిమితి 18 నుండి 40 సంవత్సరాల వరకు నిర్ణయించబడింది.

**ప్రతి నెలా 5000 రూపాయల పెన్షన్**

ఈ పథకం కింద పింఛను పొందాలంటే కనీసం 20 ఏళ్లపాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అంటే, మీకు 40 ఏళ్లు నిండి ఇంకా పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే, మీకు 60 ఏళ్లు వచ్చిన వెంటనే మీకు పెన్షన్ రావడం ప్రారంభమవుతుంది. మీ వయస్సు 18 సంవత్సరాలు అనుకుందాం.. ఆపై ప్రతి నెలా 210 రూపాయలు డిపాజిట్ చేయడం ద్వారా పెన్షన్ పొందవచ్చు. ఈ పథకంలో రోజుకు కేవలం 7 రూపాయలు మాత్రమే. మీరు 60 తర్వాత నెలకు 5000 రూపాయల పెన్షన్ పొందవచ్చు. మరోవైపు, మీకు 1,000 రూపాయల పెన్షన్ కావాలంటే, మీరు ఈ వయస్సులో ప్రతి నెలా 42 రూపాయలు మాత్రమే డిపాజిట్ చేయాలి. మీ వయస్సును బట్టి పెన్షన్ కోసం కొంత మొత్తాన్ని ప్రతి నెల డిపాజిట్ చేయాల్సి ఉంటుందని గుర్తించుకోండి. అటల్ పెన్షన్ యోజనలో చేరడం ద్వారా భార్యాభర్తలిద్దరూ నెలకు 10 వేల రూపాయల వరకు పెన్షన్ పొందవచ్చు. మరోవైపు 60 ఏళ్లలోపు భర్త చనిపోతే భార్యకు పింఛన్ సౌకర్యం లభిస్తుంది. భార్యాభర్తలిద్దరూ మరణించినప్పుడు, నామినీకి మొత్తం డబ్బు తిరిగి వస్తుంది. ఇందులో మీ ఇన్వెస్ట్‌కు రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332